RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 253 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | శనివారం, ఏప్రిల్,4, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-

MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 253 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Saturday, April, 4 , 2026 | PAGES : 8 RS : 4 /-



## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్ టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచం లోనే ఫిల్మ్‌ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణే మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్ టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు. తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది.

### మరో మూడు రోజులు

## పార్లమెంట్



**16 నుంచి తిరిగి సమావేశాలు ప్రారంభం**

**మహిళా రిజర్వేషన్, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లులపై చర్చ**

న్యూఢిల్లీ, ఏప్రిల్3: మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోం ది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు.



### యూడీఎఫ్ మేనిఫెస్టోతో కేరళకు

## స్వర్ణయుగం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా గడిపారు. తిరువనంతపురంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఎన్నికల మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ మేనిఫెస్టో కేరళ రాష్ట్రానికి ఒక "స్వర్ణయుగానికి నాంది" పలుకుతుందని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యూడీఎఫ్ అధికారంలోకి వస్తే కేరళ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా నెరవేరుస్తోందో, కేరళలోనూ అదే తరహా అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. యూడీఎఫ్ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారు.



### మరోమారు నోరు పారేసుకున్న

## ఖవాజా

### భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతామని హెచ్చరిక

ఇస్లామాబాద్, ఏప్రిల్3 :పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచి స్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణా మాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ పై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్3 : రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చడ్డా తన వీడియోలో పేర్కొన్నారు.



### రాఘవ్ చద్దాను తొలగిస్తూ

## ఆప్ నిర్ణయం

- సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ
- ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా
- ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?
- వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

చెన్నై, : తమిళనాడు అసెంబ్లీలో దళపతి విజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఒంటరిగానే పోటీచేస్తున్న తమిళగ వెట్రి కళగం ఏ మేరకు ప్రభావం చూపుతుందో మే 4న తేలిపోనుంది. ఈ ఎన్నికల్లో విజయ్ రెండు చోట్ల నుంచి బరిలో దిగారు. 35 ఏళ్ల తర్వాత ఇలా ఒకే అభ్యర్థి తమిళనాడు ఎన్నికల్లో రెండు నియోజ కవర్గాల నుంచి పోటీ చేయ డం గమ నార్హం. గతంలో అన్నాడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత మాత్రమే రెండు చోట్ల పోటీచేసి గెలిచారు.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే చీఫ్, దళపతి విజయ్ ఒంటరిగా దిగి సాహసం చేస్తున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ శాస నసభ స్థానాల నుంచి ఆయన బరిలో కి దిగుతు న్నారు. తొలి అడుగులో రాజకీయ స్థిరత్వం కోసం వ్యూహాత్మ కంగావిజ య్ అడుగులు వేస్తున్నారు.



### 35 ఏళ్ల తర్వాత

### అప్పుడు జయలలిత..

## ఇప్పుడు విజయ్



### తమిళనాడు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థుల

## జాబితా విడుదల

**27 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు**

తమిళనాడు : తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. మొత్తం 27 మందితో కూడిన జాబితాను శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఇందులో తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై పేరు లేకపోవడం విశేషం. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్..



### రెండో ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను కూల్చినట్లు

## ప్రకటించిన ఇరాన్

టెహ్రాన్: అమెరికాకు చెందిన ఎఫ్–35 ఫైటర్ విమానాన్ని కూల్చినట్లు ఇరాన్ పేర్కొన్నది. సెంట్రల్ ఇరాన్ ప్రాంతంలో ఆ విమానం కూలినట్లు తెలుస్తోంది. మెహర్ న్యూస్ ఏజెన్సీ దీనిపై ప్రకటన చేసింది. పైలెట్ తీవ్రంగా గాయపడి ఉంటాడని, అతను బ్రతికి ఉండే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది. ఎఫ్–35 విమానాన్ని ఇరాన్ కూల్చడం ఇది రెండో సారి అవుతుంది. అయితే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ మాత్రం దీనిపై ప్రకటన చేయలేదు.



### స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం

## చేయాలి

**ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు**

**టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు**


**జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్,తెలంగాణ దిశ:రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని...

### నాణ్యమైన ఆహారాన్ని అందించి వినియోగదారుల మన్ననలను పొందాలి - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

# చర్లపల్లిలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ఘనంగా ప్రారంభం







**చర్లపల్లి, ఏప్రిల్ 03,(తెలంగాణ దిశ) :** వినియోగదారులకు నాణ్యమైన ఆహారా న్ని అందించి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ జైల్ సమీపంలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ను మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కొత్త రామారావు పజ్జూరి పావని రెడ్డి, పొన్నాల దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆధారపడ కుండా సొంత నిధులతో ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్న శ్రీరామ్ బేకర్స్ స్వీట్స్ ఫుడ్స్ రెస్టారెంట్ అధినేత కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి లను ఈ సందర్భంగా అభినందించారు. మాజీమంత్రి మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత, విశ్వాసం, వినియోగదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని తెలిపారు. మంచి ఆహారం, శుభ్రత, సరైన ధరలు ఉంటేనే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గణేష్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మురళి పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. సీతారాం రెడ్డి, చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర శ్రీ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్, సర్కిల్ ఇన్ స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి (కుషాయిగూడ), ఆర్కపల్లి ఆంజనేయులు (కీసర), సుధాకర్ (చర్లపల్లి) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు విజయ్ కుమార్ రెడ్డికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ ప్రతిమను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త రెస్టారెంట్ ద్వారా స్థానికులకు మంచి నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.





కీసర మండలం శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఇనోవేటివ్ ఆక్వా చల్లపల్లి బబ్బురి బాలరాజ్ వారి సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఆలయ ఫౌండేషన్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ ప్రారంభించారు.
(కీసర, తెలంగాణ దిశ)

## 36 గంటల పాటు మీ-సేవా కేంద్రాలు బంద్




**హైదరాబాద్, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మీ-సేవా కేంద్రాలు 36 గంటలపాటు బంద్ కానున్నాయి. కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్, మెయింటెనెన్స్ పనులు, డేటాబేస్ మైగ్రేషన్ కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీ-సేవా అధికారులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ రాత్రి నుంచి 5వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల వరకు మీ-సేవా సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ సమయంలో మీ-సేవా వెబ్‌సైట్ కూడా అందుబాటులో ఉండదని స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత మీసేవ సేవలు మళ్లీ యథావిధిగా ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు సంబంధిత శాఖ మీడియా ప్రకటన విడుదల చేసింది.

## కందిగూడలో ఘనంగా హనుమాన్ విజయోత్సవం





**కాప్రా, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ) :**శ్రీ హనుమాన్ స్వామి వారి దైవ అనుగ్రహంతో కందిగూడ హనుమాన్ ఆలయం ప్రాంగణంలో హనుమాన్ విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని బీజేపీ కాప్రా డివిజన్ యువ నాయకుడు ఎస్. విభాకరన్ (బాబీ) ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం సేవా భావాన్ని, మానవత్వాన్ని ప్రతిబింబించింది. అన్నదానం మహాదానం, అన్న ప్రసాద వితరణ అంటే దేవుని సేవ చేయడం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన భక్తులు, వాలంటీర్లు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉప్పల్ - నారపల్లి కారిడార్ పేరు... రాజకీయాలకు బలి కాకూడదు

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే మీద విమర్శలు గుప్పించారు. కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు... ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు. శుక్రవారం కాప్రాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాదాపు 150 కోట్లతో సిఆర్ఎంపి నిధులతో రోడ్లను అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. మంత్రితో మాట్లాడి పనులు మంజూరు చేయించడం జరిగిందని ఆయన అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పై నిప్పులు చెరిగారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడాన్ని తీవ్రంగా ఖండించారు. బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆసేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు.

బీజేపీ మాజీ ఎమ్మెల్యే అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాకు బీజేపీపై ద్వేషం లేదు... దేశానికి సేవ చేసిన అటల్ బిహారీ వాజపేయి పట్ల అపారమైన గౌరవం ఉంది. అలాంటి మహానేత పేరు పెట్టాలంటే మేమే ముందుంటాం!" అని స్పష్టం చేశారు. "అందరూ మౌనంగా ఉన్నప్పుడు ఒక్కరే వ్యతిరేకించడం వెనుక ప్రజాహితం లేదు... రాజకీయ లాభాలే కనిపిస్తున్నాయి!" అని అన్నారు. ఇంకా తీవ్రంగా స్పందిస్తూ---"నేను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదు... నీలాగా పార్కులు కబ్జా నా రాజకీయాలు కావు!" అంటూ బీజేపీ మాజీ ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు చేశారు. దివంగత బండారి రాజిరెడ్డి గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో స్వంత నిధులతో




రోడ్లు వేయడం భవనాలు కట్టివ్వడం జరిగిందని అన్నారు. "ప్రజల కోసంబ్రతికిన నాయకుడు... ప్రజల కోసం పోరాడిన మహానేత... అలాంటి వ్యక్తి పేరును వ్యతిరేకించడం అంటే ప్రజల మనసును అవమానించడం!" అని అన్నారు. "అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు... ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు! అధికారంలో ఉన్నా లేకపోయినా... ప్రజల కోసం నిధులు తీసుకురావడం మా బాధ్యత... మా పోరాటం ఆగదు!" అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు బిఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుడు సాయి జన్ శేఖర్, గిల్ బర్ట్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా- కలెక్టర్ రాజర్షి షా

### - వినతి పత్రాన్ని అందజేసిన టీఎస్ జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి - తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు
### - అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక






**అదిలాబాద్, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ) :** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్ జెయు) అదిలాబాద్ జిల్లా నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్, ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టుల అందరికీ అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడంతోపాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని కోరారు. అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు. దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. యూనియన్ కోశాధికారి అమృత్, ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షులు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎమ్మూర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను దూషించడంతోపాటు దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### - నాచారం పోలీసులకు బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు





**నాచారం, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ) :**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని దూషించడమే కాకుండా దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ నేతలు శుక్రవారం నాచారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వివిఎస్ ప్రభాకర్ ఆదేశాల మేరకు హెచ్ఎంటి నగర్ కమాన్ ఎదుట బిజెపి నాయకులు మొత్తం మూడు డివిజన్ల నుంచి 12 మంది హెచ్ఎంటి కమాన్ ముందు ధర్నా చేసి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆందోళనలో భాగంగా బిజెపి నాయకుడు గోపాల్ గౌడ్ "అభి అభి క్యా హువా బిఎల్ఆర్ మార్గయా" అంటూ నినాదాలు చేశారని ఫిర్యాదులో వివరించారు. అంతే కాకుండా ఎమ్మెల్యే ను ఖబర్దార్ అంటూ హెచ్చరించడంతోపాటు నియోజకవర్గంలో ఎక్కడ తిరుగనీయమంటూ బెదిరింపులకు దిగారని వివరించారు. గోపాల్ గౌడ్ ఇప్పటికీ పలుమార్లు ఆకారణంగా గొడవలు సృష్టించి నాచారంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు స్వీకరించిన ఇన్ స్పెక్టర్ ధనుంజయ గౌడ్ మాట్లాడుతూ ఈ విషయంలో న్యాయ సలహా తీసుకొని తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ముందు నినాదాలు చేసారు.

# మిడిల్ ఈస్ట్‌లో యుద్ధ ప్రభావం

### ఎయిర్ స్పేస్ మూసివేతతో ఇక్కట్లు
### 13 అంతర్జాతీయ విమానసర్వీసులు రద్దు

హైదరాబాద్: మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మన హైదరాబాద్ ప్రయాణికులపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావంతో 13 అంతర్జాతీయ సర్వీసులు రద్దు అయ్యాయి. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వెళ్లాల్సిన పలు అంతర్జాతీయ విమానాలు శనివారం రద్దు అయ్యాయి. మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ప్రయాణికుల భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణం కారణంగా ఆయా దేశాల ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేశారు. ఇరాన్ – ఇజ్రాయిల్ మధ్య కొనసాగుతున్న దాడులు, ప్రతిదాడుల వల్ల అంతర్జాతీయ ఎయిర్ ట్రాఫిక్ పూర్తిగా ప్రభావితమైంది.

# భానుడి భగ భగలు



జూలూరుపాడు:వేసవి కాలం ముందే మొదలైంది మార్చి నెల ప్రథమార్థం నుంచి ఇప్పటివరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉష్ణోగ్రతల నమోదు మండలంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇప్పటికి 32ఎ, నుండి 33 డిగ్రీలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 2-3 జ, అదనంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల లో కనిపించే ఎండ తీవ్రత ఈ ఏడాదిలో మార్చి నెలలో చూస్తున్నాం .ప్రస్తుతం ఎండలు మండుతున్నప్పటికీ రాబోయే కొన్ని రోజుల్లో రాష్ట్రానికి స్వల్ప ఉపశమనం లభించే అవకాశం ఉందని, అలాగే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ప్రభావం ఇంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏప్రిల్, మే నెలలో వడగాలులు ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవైపు భానుడి సెగలు ఉన్నా కూడా రైతు సోదరులు మిర్చి తోటలలో పనులు నిర్వహిస్తున్నారు. కాలం రాకముందే ఉష్ణోగ్రత ఎక్కువ ఉండటం వలన బయటకు రాలేని పరిస్థితి. కానీ రైతు మాత్రం ఈ ఉష్ణోగ్రతను లెక్కచేయకుండా పండించిన పంటను పూర్తి న్యాయం చేస్తున్నారు.

# సంపాదకీయం

## నరకయాతనకు విముక్తి

కారుణ్య మరణాలు ఇటీవల పెరుగుతున్నాయి. కారణం ఏదైనా కారుణ్య మరణం కోసం కోర్టును ఆశ్రయిస్తున్నారు. విచారణ తర్వాత చాలా వరకు తిరస్కరణకు గురవుతున్నాయి. అయితే కొన్నింటిని మాత్రం కోర్టు కూడా అంగీకరిస్తోంది తాజాగా 13 ఏళ్లుగా కోమాలో ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు సుప్రీంకోర్టు కారుణ్య మరణం అనుమతించడం భారత న్యాయ చరిత్రలో చారిత్రాత్మక సంఘటనగా నమోదైంది. సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అతడికి ప్రాణాధార చికిత్స వ్యవస్థలను తొలగించడానికి సుప్రీం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం దేశంలో ఈ విధానానికి మొదటి సారి ఇచ్చిన అనుమతి.ఓ మనిషి కారుణ్య మరణానికి అనుమతినిచ్చింది. 12 సంవత్సరాలకు పైగా కోమాలో ఉన్న 31 ఏళ్ల వ్యక్తికి సుప్రీంకోర్టు బుధవారం పాసివ్ యుథనేషియా మంజూరు చేసింది. అతని కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించాలిన సుప్రీంకోర్టు ఆదేశించింది. పాసివ్ యుథనేషియా అనేది ఒక రోగిని ఉద్దేశపూర్వకంగా ప్రాణాలతో ఉంచడానికి అవసరమైన లైఫ్ సపోర్ట్. ఇతర చికిత్సను నిలిపివేయడం ద్వారా చనిపోవడానికి అనుమతించే ప్రక్రియ.ఘజియాబాద్‌కు చెందిన 31 ఏళ్ల హరీష్ రాణాకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిష్క్రియాత్మక కారుణ్య మరణాన్ని మంజూరు చేసింది. తన కొడుకు మరణాన్ని కోరుతూ తండ్రి సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నాడు. న్యాయమూర్తులు జెబి పార్దివాలా, కెవి విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది.అనాయాస మరణం కోరుతూ దాఖలైన పిటిషన్‌పై తీర్పు వెలువరిస్తూ, జస్టిస్ జె.బి. పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "దేవుడు మనిషిని జీవితాన్ని అంగీకరిస్తున్నాడా లేదా అని అడగడు, జీవితాన్ని అతనే తీసుకోవాలి." అని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా మంచం పట్టిన 31 ఏళ్ల హరీష్ రాణాకు ఇప్పుడు కారుణ్య మరణం మంజూరు కానుంది. గౌరవప్రదమైన మరణ హక్కును గుర్తిస్తూ 2018 కామన్ కాజ్ నిర్ణయం తర్వాత కారుణ్య మరణం అనేది మొదటి న్యాయపరమైన నిర్ణయం. తన తీర్పును వెలువరించే ముందు, హరీష్ కోలుకునే అవకాశం లేదని తేల్చిన రెండు కోర్టు నియమించిన వైద్య బోర్డుల నివేదికలను ధర్మాసనం పరిశీలించింది.ఘజియాబాద్‌లోని రాజ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో నివసించే హరీష్ తల్లిదండ్రులు దాఖలు చేసిన పిటిషన్ ప్రకారం, అతను 12 సంవత్సరాలుగా మంచానికే పరిమితమయ్యాడు. అతనికి ద్రవ ఆహారం మాత్రమే ఇస్తున్నారు. 2013లో తన ఇంటి నాల్గవ అంతస్తు నుంచి పడిపోవడంతో హరీష్ రాణా తలకు తీవ్ర గాయాలయ్యాయి. దశాబ్ద కాలంగా కోమాలో ఉన్నాడు. వైద్య చికిత్సను ఉపసంహరించుకునేలా హరీష్‌ను పాలియేటివ్ కేర్‌లో చేర్చాలని ధర్మాసనం ఎయిమ్స్ ను ఆదేశించింది. అతని గౌరవాన్ని కాపాడుకోవడానికి ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఈ ఉపసంహరణ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.తీర్పు వెలువరించే ముందు హరీష్ రాణా తల్లిదండ్రులను కలవాలని సుప్రీంకోర్టు కోరిక వ్యక్తం చేసింది. ఢిల్లీకి చెందిన ఎయిమ్స్‌కు చెందిన సెకండరీ మెడికల్ బోర్డ్ ఆఫ్ డాక్టర్లు దాఖలు చేసిన హరీష్ రాణా మెడికల్ రిపోర్టుతో కూడిన నివేదికను చూసి, అది విచారకరమైన నివేదిక అని పేర్కొంది. రోగి పరిస్థితిని పరిశీలించిన తర్వాత, ప్రాథమిక వైద్య బోర్డు అతను కోలుకునే అవకాశం చాలా తక్కువ అని తేల్చి చెప్పింది. డిసెంబర్ 11న, ప్రాథమిక వైద్య బోర్డు నివేదిక ఆ వ్యక్తి పరిస్థితి చాలా విషమంగా ఉందని సూచించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. 2023లో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, రోగికి కృత్రిమ లైఫ్ సపోర్ట్‌ను తొలగించడంపై నిపుణుల అభిప్రాయాన్ని పొందడానికి ప్రాథమిక, ద్వితీయ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయడం తప్పనిసరి అయ్యింది. అరుణాకు కారుణ్య మరణం అనుమతించాలని జర్నలిస్ట్ పింకీ విరాణి సుప్రీంకోర్టులో 2011లో పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు చికిత్సను నిలిపివేసి సహజ మరణం (పాసివ్ యూతనేషియా) అనుమతించాలని నిర్ణయించింది, కానీ బాధితుడి తల్లిదండ్రులు, భాగస్వామి లేదా సన్నిహితుల అనుమతి తప్పనిసరిగా నిర్దేశించింది. 'నెక్సట్ ఫ్రెండ్'గా పింకీని నిరాకరించి, ఆసుపత్రి సిబ్బందిని సూరిగా నియమించింది, వారు చికిత్స నిలిపివేయడానికి ఒప్పుకోకపోవడంతో పిటిషన్ తిరస్కరించబడింది. నాలుగు దశాబ్దాలుగా జీవచ్ఛవం వల్ల ఉన్న అరుణా 2015లో న్యుమోనియాతో మరణించిందిఅరుణా కేసు ఆధారంగా 2018లో సుప్రీంకోర్టు 'గౌరవప్రద మరణం'ను ప్రాథమిక హక్కుగా గుర్తించి పాసివ్ యూతనేషియాను అధికారికంగా చట్టబద్ధం చేసింది. హరీశ్ రాణా (ఇంజినీరింగ్ విద్యార్థి) 2013లో చండీగఢ్ యూనివర్సిటీ హాస్టల్ నాలో అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయి తలకు తీవ్ర గాయం కారణంగా 13 ఏళ్లు కోమాలో ఉన్నాడు. తల్లిదండ్రులు సుప్రీంకోర్టుకు అనేక సంవత్సరాలు పిటిషన్ చేసిన తరువాత, వైద్య నివేదికల ఆధారంగా మార్చి 2026లో చికిత్స తొలగించడానికి అనుమతించింది, ఇది అరుణా మార్గదర్శకాల ప్రకారం మొదటి సారిగా ఇచ్చిన తీర్పుప్రస్తుత కేసులో చికిత్స నిలిపివేత ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు ధర్మాసనం తన నిర్ణయంలో పేర్కొంది. ప్రాథమిక , ద్వితీయ బోర్డులు నిలిపివేతను నిర్ధారించిన తర్వాత, కోర్టు జోక్యం అవసరం లేదు. ఇది మొదటిది కాబట్టి, ఈ విషయాన్ని కోర్టుకు సూచించడం సముచితంగా పరిగణించకూడదని ధర్మాసన పేర్కొంది. రోగులకు చికిత్స నిలిపివేత ప్రక్రియ మానవీయంగా ఉండాలి, దీనికి ఒక క్రమబద్ధత అవసరమని సుప్రీంకోర్టు తెలిపింది.

# యువతలో రాజకీయ 'పవనాలు'



యువత రాజకీయాల్లోకి రావాలని, పాలితులుగా ఉండకుండా పాలకులుగా వారు ఎదగాలని.. ప్రతీ ఒక్కరూ ఆకాంక్షిస్తారు. కానీ, ఆచరణలో ఆ దిశగా యూత్‌ను చైతన్య పరిచి రాజకీయ రంగంలో వారు ముందుకు సాగేలా ప్రోత్సహించే వారు కొద్ది మందే. ముఖ్యంగా యువతలో రాజకీయ చైతన్యం నింపుతూ.. తమదైన గమ్యం చేరుకునేలా ప్రోత్సాహం అందించడం కీలకం. ఆ దిశగా వారి అడుగులు పడేలా ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వంతు ప్రోత్సాహం ఇస్తున్నారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన జనసేన పార్టీలో యువతకు ప్రాధాన్యమిస్తున్నారు.

సంప్రదాయ రాజకీయ పార్టీలకు ఉండే భావ జాలానికి భిన్నంగా తన పార్టీలో జన సైనికులకు తమదైన పంథాలో ప్రయాణం కొనసాగించేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. ఫలితంగా యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతున్నది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పొలిటికల్‌గా జర్నీ చేయాలని యువతీ యువకులు నడుం బిగుస్తున్నారని చెప్పవచ్చు. జనసేన పార్టీలో జన సైనికులుగా తమ రాజకీయాన్ని షురూ చేయాలనే యువత పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నది.

**విలక్షణ శైలి పవన్ సొంతం**

అధికార వికేంద్రీకరణ, పర్యావరణ పరిరక్షణ, సుపరిపాలన వంటి అంశాలతో పాటు దేశభక్తి గురించి నినదించే నాయకుడిగా పవన్ పేరు సంపాదించుకున్నారు. ముఖ్యంగా యువత అభిమానించే లీడర్‌గా పవన్ ఎమర్జ్ అయ్యారు. భారతదేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగానూ ఆయన సినీ నటుడిగా ఫుల్ ఫేమస్. గూగుల్‌లో ఆయన గురించి నెటిజన్లు ఎక్కువగా సెర్చ్ చేయడంతో గూగుల్ పాపులర్ పర్సన్‌గా యాక్టర్స్ కేటగిరీలో రికార్డుకెక్కారు. ఇక దేశంలో.. తెలుగు రాష్ట్రాలలోనే కాదు ఆ మాటకొస్తే.. దక్షిణాదియే కాదు.. యావత్ భారతదేశంలోనూ ఆయనకు పలుకుబడి ఉంది. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లు ఆయనకొక 'తుఫాను'లాగా ముందుకెళ్లగలరు. హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో దే శరాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టించారు.

**దేశభక్తికి మారుపేరు**

అంత కలిపి నేను పిడికెడు మట్టే కావచ్చు. కానీ నేను ఒకసారి తలెత్తి చూస్తే ఒక దేశపు జెండాకు ఉన్నంత పొగరుంది' అంటూ అశేష అభిమానులను ఉద్దేశించి పవన్ చెప్పే మాటలు ప్రతీ ఒక్కరిలో ఉత్సాహాన్ని , దేశభక్తిని నూరిపోస్తాయి. ముఖ్యంగా యువతను ఉద్దేశించి.. 'కలలు కను' అంటూ గుంటూరు శేషేంద్ర శర్మ, బాలగంగాధర్ తిలక్ కవితలను ఉటంకిస్తూ.. భావోద్వేగంతో పవన్ చెప్పే మాటల యువతను ఉత్తేజితం చేస్తున్నాయి. ప్రస్తుతం పాలనాపరంగా డిప్యూటీ సీఎంగా సేవలందిస్తూనే.. నటనాపరంగానూ కుదిరినంతలో సినిమాలు చేస్తూ.. ఒకే సమయంలో నటుడిగానూ, నాయకుడిగానూ.. జోడు గుర్రాల మీద స్వారీ చేస్తూ.. ప్రజల్లో ఉన్నారు. జనసేన అధినేతగా ఉన్న పవన్ కల్యాణ్.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అత్యంత ఆత్మీయుడిగా ఉన్నారు. ఆయన భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగానే కనిపిస్తున్నాయి. ఆయన తనను తాను తెలుగు రాష్ట్రాలకే పరిమితం చేసుకోకుండా దక్షిణ భారతదేశంతో పాటు ఉత్తర భారతంలోని వివిధ అంశాలపైన మాట్లాడటం చూస్తుంటే.. యువతలో రాజకీయ చైతన్యం కలిగించేలా.. వారికి జనసేనను ఒక రాజకీయ వేదికగా అందించేందుకు గేట్లుతెరిచే ఉంచినట్లు స్పష్టమౌతున్నది. ఇక దక్షిణ భారతాన అయితే ఇప్పటికే పలువురు సినీ నటులు వెండితెరను వదిలి రాజకీయ రణరంగాన సంచలనాలు సృష్టించారు. ఆ కోవకు చెందిన నాయకుడిగా పవన్ కల్యాణ్ నిలిచారు. అయితే, పవన్ తనదైన శైలిలో స్వయం ప్రకాశితుడిగా, పడి లేచిన కెరటం లా రాజకీయ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఆయన భాషలోనే మరో మాటలో చెప్పాలంటే.. 'ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పవాడు' అనే సినీ డైలాగ్‌ను రియల్ లైఫ్‌లోనూ పవన్ ఫాలో అవుతున్నట్లున్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని అందులో.. బలమైన భావ జాలం, సిద్ధాంతం, దేశం పట్ల ప్రేమతో,దేశభక్తితో కూడిన పార్టీగాఉన్న జనసేనలోకి యువత పెద్ద ఎత్తున రావా లని.. నవ భారత నిర్మాణానికి అడుగులు పడాల ని ఆశిస్తున్నా...



లింగబత్తిని కృష్ణ, జర్నలిస్ట్,
సెల్ : 9701923260.

# కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు కృషి చేయాలి



## - డీసీసీ నూతన సభ్యులతో కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 03, (తెలంగాణ దిశ)** :కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు జిల్లా నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి సూచించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీకి నూతనంగా నియమితులైన సభ్యులు శుక్రవారం ఆయనను బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అనుమతితో డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో ఈ నియామకాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులుగా ముత్యంరెడ్డి, బుయ్యని శివ కుమార్, ప్రధాన కార్యదర్శులు బైరి ప్రశాంత్ గౌడ్, సోమన్నగారి శ్రీధర్ రెడ్డి,గోపాల్ రెడ్డి, కార్యదర్శులుగా పండరి రావు, గణేష్, కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మి చౌదరి, కరణ్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంచందర్, హరి కిరణ్ పటేల్, చందు, రాజు చారి, తైలం శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, హన్మి రెడ్డి, సత్తి రెడ్డి, నాగేంద్ర, అనిల్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# మరింత దిగజారిన బంగారం ధరలు



న్యూఢిల్లీ, :అంతర్జాతీయంగా అనిశ్చితి కారణంగా స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువతో పాటు బంగారం, వెండి ధరలు కూడా మరింత కిందకు దిగివస్తున్నాయి. బంగారం, వెండి ధరలు భారీగా తగ్గాయి. మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుం డడమే బంగారం, వెండి తగ్గుదలకు కారణంగా కనిపిస్తోంది. శనివా రం ఉదయం 10:10 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1, 59,660కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.1030 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,46,350 దగ్గర ఉంది . నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.950 మేర తగ్గింది. రోవైపు వెండి ధరలు కూడా శనివారం తగ్గుదల నమోదు చేశాయి. వెండి కిలోకు రూ.4,900 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.75 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.8 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

## కూటమిలో పైన పటారం.. లోన లొటారం?

విజయవాడ,తెలంగాణ దిశ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,బీజేపీ అగ్రనేతలు అత్యంత సమన్వయ ంతో, ఒకే మాట – ఒకే బాట అన్నట్లుగా ముందుకు సాగుతున్నారు. కానీ, క్షేత్రస్థాయి నియోజకవర్గాల్లో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పాత కక్షలు, ఆధిపత్య పోరాటాలు కూటమి నేతల మధ్య చిచ్చు పెడుతున్నాయి. కదిరిలో బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి గృహనిర్బం ధం ఘటన ఈ అంతర్గత విభేదాలకు ఒక నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది.

# అడగడుగునా అడ్డంకులు... ముందుకు సాగేదెలా?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే రేవంత్ రెడ్డి సర్కార్ సంకల్పంలో 'మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్' కీలకమైనది. అయితే, ప్రారంభం నుంచీ ఈ ప్రాజెక్టు విమర్శలు, రాజకీయ వివాదాలు, నిర్వాసితుల ఆందోళనల మధ్య నలిగిపోతోంది. ఈ నేపథ్యంలో, అపోహలను తొలగించి, ప్రాజెక్టు పారదర్శకతను చాటిచెప్పేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. 500 మంది నిపుణులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఈ ప్రాజెక్టు భవితవ్యాన్ని నిర్ణయించబోయే ఒక కీలక మలుపు.సాధారణంగా ఇలాంటి ప్రాజెక్టుల వివరణను అధికారులు లేదా కన్సల్టెంట్లు ఇస్తారు. కానీ మూసీ ప్రాజెక్టు విషయంలో సీఎం స్వయంగా వివరణ ఇవ్వాలని నిర్ణయించుకోవడం వెనుక బలమైన రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహం ఉంది. బఫర్ జోన్ పరిధిలోని ఇళ్ల కూల్చివేతలు, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. బాధితుల్లో ఉన్న భయాన్ని తొలగించేందుకు నేరుగా ముఖ్యమంత్రే హామీ ఇస్తున్నారు అనే నమ్మకాన్ని కలిగించడం దీని ప్రధాన ఉద్దేశం. మూసీని లండన్‌లోని థేమ్స్ నది తరహాలో మారుస్తామన్న తన విజన్‌ను ప్రజల్లోకి నేరుగా తీసుకెళ్లడం ద్వారా, అభివృద్ధి నిరోధకులు ఎవరో ప్రజలే తేల్చుకోవాలనే సంకేతాన్ని ఆయన ఇవ్వనున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి ఉన్న స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వారికి వివరించడం ద్వారా నిధుల సమీక రణను సులభతరం చేసుకోవడం మరో లక్ష్యంముఖ్యమంత్రి తన ప్రజెంటేషన్‌లో ఐదు దశల్లో జరగబోయే అభివృద్ధిని వివరించను న్నారు. మొదటి దశలో చేపట్టబోయే పనులు, అందుకు అవసరమైన భూసేకరణ, రక్షణ గోడల నిర్మాణం గురించి క్లారిటీ ఇవ్వనున్నారు. 50 మీటర్ల బఫర్ జోన్ పరిధిలో ఉన్న నిర్మాణాలకు చట్టబద్ధంగా విలువ లేకపోయినా, మానవీయ కోణంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రత్యా మ్నాయ స్థలాలు, ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం హామీ ఇవ్వను న్నారు.బాపూఘాట్ వద్ద రూ.400 కోట్లతో నిర్మించ తలపెట్టిన 'గాంధీ సరోవర్', నది ఇరువైపులా నిర్మించబోయే ఎకనామిక్ జోన్ల గురించి విడమర్చి చెప్పనున్నారు.ప్రాజెక్టుకుమోక్షం కలగడం అనేది ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. మేధా పాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఇప్పటికే ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరుతున్నారు.

ప్రజెంటేషన్ తర్వాత నిర్వాసితుల అనుమానాలు పటాపంచలైతేనే క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం అవుతాయి. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నేతలను ఆహ్వానించారు. ఒకవేళ ప్రతిపక్షాలు సానుకూలంగా స్పందిస్తే ప్రాజెక్టుకు రాజకీయ అడ్డంకులు తొలగుతాయి. లేనిపక్షంలో ఇది కేవలం అధికార పక్ష 'షో'గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కేవలం డిజైన్లు చూపడం కాకుండా, క్షేత్రస్థాయిలో పునరావాస పనులు ఏ మేరకు పకడ్బందీగా జరుగుతాయన్న దానిపైనే ప్రాజెక్టు విజయం ఆధారపడి ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రజెంటేషన్ ద్వారా మూసీ ప్రాజెక్టును రాజకీయ వివాదం నుంచి అభివృద్ధి అజెండాగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు

# ఇరాన్ దాడులతో దుబాయ్ అతలాకుతలం

## షాపింగ్ మాల్స్ మూతతో పర్యాటకం బంద్

దుబయ్:దుబాయ్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల కలల నగరం. పెట్టుబడులకు, రక్షణకు, స్వేచ్ఛా జీవితానికి దుబాయ్ ప్రతీక. విమానయాన రంగానికి కీలక స్థానం. ఎప్పుడూ విదేశీ పర్యాటకులు, పెట్టుబడిదారులతో కళకళలాడే నగరం. అలాంటి మహా నగరాన్ని ఇరాన్ యుద్ధం కళా విహీనంగా మార్చింది. పశ్చిమాసియాలో యుద్ధం దుబాయ్ నగరంపై తీవ్ర ప్రభావం చూపించింది .యుద్ధం నేపథ్యంలో దుబాయ్ నగరం బోసిపోయింది. చాలా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, వాణిజ్య సంస్థలను మూసేశారు. రోడ్లపై జనసంచారం లేదు.

నిత్యం పర్యాటకులతో కళకళలాడే బీచ్‌లు ఖాళీగా కనిపిస్తున్నాయి. బుర్జ్ అల్ అరబ్ సహా పలు ప్రముఖ హోటళ్లు క్షిపణి దాడులకు గురి కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. చాలా మంది దేశం విడిచి వెళ్లిపోయారు.విమాన సర్వీసులు భారీగా రద్దవ్వడంతో పర్యాటక రంగమూ కుదేలైంది.

Volume : 3 Issue No. 253 తెలంగాణ దిశ Saturday, April, 4 , 2026 శనివారం, ఏప్రిల్,4, 2026



# ఆలుగడ్డలను ఈ విధంగా మాత్రం తినకండి..

ఆలుగడ్డలను సహజంగానే చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. వీటితో వేపుడు చేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. అలాగే కుర్మా, టమాటా కూర కూడా చేసి తినవచ్చు. ఆలుతో చిప్స్‌ను కూడా తయారు చేసి తింటారు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. కానీ ఆలును వేపుళ్లు, చిప్స్ లాంటి రూపంలో తింటే మనకు జరిగే మేలు ఏమీ ఉండదు. కానీ నష్టం మాత్రం అధికంగా ఉంటుంది. అదే ఆలుగడ్డలను ఉడకబెట్టి లేదా కూరగా చేసి తింటేనే మనకు లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డల్లో మన శరీరానికి కావల్సిన పలు ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఆలుగడ్డల్లో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు శక్తిని అందిస్తాయి. ఒక మీడియం సైజు ఆలుగడ్డలో సుమారుగా 26 గ్రాముల మేర పిండి పదార్థాలు ఉంటాయి.

**క్యాన్సర్ రాకుండా..:** ఆలుగడ్డను పిండి పదార్థాలకు మంచి నెలవుగా చెప్పవచ్చు. ఇది శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తుంది. కానీ అధికంగా తింటే మాత్రం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారికి కావల్సిన శక్తిని ఆలుగడ్డలు అందిస్తాయి. కనుక వారు రోజూ వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. అలాగే ఆలుగడ్డలో ఉండే పలు సమ్మేళనాలు పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆలుగడ్డలను మోతాదులో తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ట్రై గ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. ఆలుగడ్డలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. వేయించి లేదా పచ్చిగా తినకూడదు. ఇవి సరిగ్గా జీర్ణం కావు.

**పోషకాలు అధికంగా..:** 150 గ్రాముల మేర ఆలుగడ్డలను తింటే 27 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. మనకు రోజుకు కావల్సిన విటమిన్ సి లో ఇది 45 శాతం. అలాగే 630 మిల్లీగ్రాముల మేర పొటాషియం, 0.2 మిల్లీగ్రాముల విటమిన్ బి6, స్వల్ప మోతాదులో థయామిన్, రైబోఫ్లేవిన్, ఫోలేట్, నియాసిన్, మెగ్నిషియం, ఐరన్, జింక్ తదితర పోషకాలు వీటి ద్వారా లభిస్తాయి. ఆలుగడ్డలను పైన పొట్టుతో తింటే మేలు. చాలా మంది పొట్టు తీసేసి తింటారు. దీని వల్ల అనేక పోషకాలను, ముఖ్యంగా ఫైబర్‌ను కోల్పోవాల్సి వస్తుంది. ఆలుగడ్డలను బాగా కడిగి తొక్కతో సహా ఉడకబెట్టి తింటే మేలు జరుగుతుంది. ఆలుగడ్డల్లో కార్టినాయిడ్స్, పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయి.

## లాభం కలగదు సరికదా, తీవ్రంగా నష్టం ఉంటుంది..


**అందానికి కూడా..:** ఆలుగడ్డలు కేవలం ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాదు, అందానికి కూడా పనిచేస్తాయి. ఆలుగడ్డలను గుజ్జుగా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించవచ్చు. దాన్నే జుట్టుకు రాసి హెయిర్ ప్యాక్‌లా వాడవచ్చు. దీంతో చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఆలుగడ్డలను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి అనంతరం వాటిని తీసి చక్రాల్లా అడ్డంగా కట్ చేయాలి. ఆ ముక్కలను కళ్లపై 15 నిమిషాల పాటు పెట్టుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే కళ్ల కింద ఉండే డార్క్ సర్కిల్స్ మాయం అవుతాయి. ఆలుగడ్డల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. వీటిల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలుగడ్డలు ఆరోగ్యానికి ప్రయోజనకరమే అయినప్పటికీ వీటిని అధికంగా తినకూడదు. అధిక బరువు ఉన్నవారు, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు వీటిని తినాలి.

# కోలన్ క్యాన్సర్ కారకాలు



మనిషిని దీర్ఘకాలంపాటు పట్టి పీడించే వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనది. క్యాన్సర్లలో పెద్దపేగు (కోలన్) క్యాన్సర్ ఒకటి. అయితే, మనలో చాలామందికి కోలన్ క్యాన్సర్ ముప్పును పెంచే జీవనశైలి అలవాట్ల గురించి అంతగా తెలియదని ఓహియో స్టేట్ యూనివర్సిటీ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఊబకాయం, మద్యపానం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు పెద్దపేగు క్యాన్సర్‌కు దోహదపడతాయి. కాబట్టి, దీనికి సంబంధించి అనుమానంగా అనిపించినా, డాక్టర్లు అవసరమని చెప్పినా.. 45 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కొలనోస్కోపీ చేయించుకోవడం మంచిదట. వీలైతే ఇంకా ముందే మేల్కోవాలని పరిశోధకులు సూచించారు.

# ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

. ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి. ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా.. ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుం ది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగను రోజూ సేవించడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..:** మజ్జిగ ప్రొ బయోటిక్ ఆహారాల జాబితాకు చెందినది. అందువల్ల మజ్జిగను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.

ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణంఅయ్యేలా చేస్తుంది.కడుపుఉబ్బరం, అసిడి టీ, గ్యాస్‌సమస్యల నుంచి ఉపశమనంలభిస్తుంది.మలబద్దకం తగ్గు తుంది. మజ్జిగలోక్యాల్షియం సమృద్ధిగాఉంటుంది.అందువల్ల మజ్జిగ ను రోజూ సేవిస్తే ఎముకలు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్ఉంటుంది.ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి మజ్జిగ మంచి ఆహారం అని చెప్పవచ్చు. మజ్జిగలో ప్రోటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటాయి. పెరుగుతో పోలిస్తే మజ్జిగలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తాగితే ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో ఆహార్ తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. మజ్జిగను తాగడం వల్ల వేసవిలో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..:** మజ్జిగలో అనేక ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మజ్జిగలో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు మజ్జిగను సేవిస్తుంటే ప్రయోజనం ఉంటుంది. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. మజ్జిగలో ఉండే రైబోఫ్లేవిన్ లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో లివర్‌లో ఉండు వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు రోజూ మజ్జిగను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. చర్మ సంరక్షణకు కూడా మజ్జిగ మేలు చేస్తుంది. మజ్జిగను సేవిస్తుంటే డ్యామేజ్ అయిన చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. ఇలా మజ్జిగను రోజూ సేవిస్తే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# మహిళలూ.. ఈ పోషకాలు అందేలా చూసుకోండి!




గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళ లకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమ వుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి. యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి: చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్డు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్‌ఒ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, ఫిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్-ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్-ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్-సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్-డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్-డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్లు రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.


విటమిన్-బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్-బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్-బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్-బి9 : ముఖ్యమైన విటమిన్లలో 'బి9' (ఫోలిక్ యాసిడ్) కూడా ఒకటి. ఇది గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది ఆకుకూరలు, బీన్స్, పప్పు ధాన్యాలు, అరటిపండ్లు, చేపల్లో ఎక్కువగా ఉంటుంది.

విటమిన్-బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్-బి12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇది చేపలు, పాలు, గుడ్డు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం.

# భయం భయంగా.. జీవిస్తున్నారు..






చుట్టూ మనుషులు ఉంటారు. కానీ వాళ్లు ఒంటరులు. చేతి నిండా పని ఉంటుంది. కానీ చేయాలంటే వణుకు. ఎక్కడ .. ఎలాంటి వేధింపులు ఎదురవుతాయో తెలియని అయోమయం. భద్రత లేదు. భరోసా లేదు. అయినా బతుకుబండిని లాగేందుకు అహర్నిశలు శ్రమిస్తారు. పార్కుల్లో పడిగాపులు, సాయంత్రానికి మొదటి భోజనం వారి దినచర్య. బిక్కుబిక్కుమంటూ రోజులు వెల్లదీస్తున్న వారు ఇంటి పని కోసం ఆన్‌లైన్ యాప్ ఆధారిత కంపెనీల్లో పనిచేసే గిగ్ మహిళా కార్మికులు. మెరుగైన జీతమన్న ఆశతో వచ్చారు. పంజరం లాంటి కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకున్నారు. కళ్లల్లో నీరు కళ్లల్లోనే ఉంచుకుని, బాధనంతా గుండెల్లోనే నింపుకుని పనిచేస్తున్న ఎందరో మహిళా కార్మికులు ఇప్పుడు మనచుట్టూ చాలామంది ఉన్నారు. వారి జీవితాలను కళ్లకుకట్టినట్లు చూపిస్తున్న కొందరి బతుకులు ఇవి .. బెంగుళూరు, ఢిల్లీ వంటి మెట్రో నగరాల్లో ఎప్పటినుండో ఇంటి పని కోసం ఆన్‌లైన్‌లో కార్మికులను బుకింగ్ చేసుకోవడం ఉంది. ఈ వాతావరణం ఇప్పుడు దేశంలో చాలాచోట్ల కనిపిస్తోంది. నిర్ణీత పనిగంటలు, ఆశాజనక వేతనం మహిళలను కూడా ఈ రంగంవైపు విశేషంగా ఆకర్షిస్తోంది. అయితే అంతంత మాత్రం భద్రతా ప్రమాణాలు పాటిస్తున్న కంపెనీల చర్యలు ఆ మహిళలను భయం గుప్పిట్లో జీవించేలా చేస్తున్నాయి. ఆందోళనతో రోజు తెల్లారుతుంది. బెంగుళూరులో నివసిస్తున్న 21 ఏళ్ల బర్ఖా ప్రయాణం ఉదయం 4:30 గంటలకే మొదలవుతుంది.

ఫోనులో యాప్ ఓపెన్ చేసి, బుకింగ్ చెక్ చేసుకుని ఆమె బయలుదేరుతుంది. చీకటిగా ఉన్న పొడవైన రోడ్డు మీదుగా వేగంగా నడుస్తున్న ఆమెకు దారిలో ఎంతోమంది పురుషులు అడ్డు వస్తారు. ఒక్కోసారి గుంపులుగా ఉన్న వారిని చూస్తే ఆమెకు ఎక్కడలేని చెమటలు పట్టేస్తాయి. అయినా ధైర్యం తెచ్చుకుని ముందుకు నడుస్తుంది. బుకింగ్ సమయం 6 గంటలకల్లా గమ్యస్థానం చేరుకోవాలి. లేకపోతే కంపెనీ తన జీతంలో కోత విధిస్తుంది.

క్లీనింగ్, మసాజ్, సెలూన్, కుకింగ్ .. ఇతర పనుల కోసం ప్రముఖ హోమ్ సర్వీస్ ఇండస్ట్రీలో బర్ఖా తన పేరు నమోదుచేసుకుంది. అయితే ఒక్కోసారి కస్టమర్ల నుండి ఆమెకు కొత్త పనులు చేయమని హుకుంలు జారీచేయబడతాయి. చేయకపోతే యజమాని ఇళ్లల్లో దాడులు, అవమానాలు, లైంగిక వేధింపులు ఎదురవుతాయి. వాటి గురించి ఆందోళన చెందుతూనే తను నిద్రలేస్తుంది.

ఊహించని పరిణామం: ఒకరోజు ఆమెకు ఎదురైన చేదు అనుభవం నుండి ఇప్పటికీ తను తేరుకోలేదు.

ఎప్పటిలానే ఆ రోజు చివరి బుకింగ్ చూసుకుని బర్ఖా ఆ ఇంటికి వెళ్లింది. అక్కడ 30 ఏళ్లు పైబడ్డ ఒకతను తలుపు తెరిచి పని గురించి చెప్పాడు. బర్ఖా ఇల్లంతా చక్కదిద్దుతోంది. అంట్లు తోమింది. బట్టలు ఉతికింది. అల్మర్లు సర్దింది. ఇల్లు ఊడ్చింది. అప్పుడే ఆమె ఊహించని సంఘటన ఒకటి జరిగింది. ఆ వ్యక్తి ఒక్కసారిగా తనని వెనక నుండి గట్టిగా పట్టుకున్నాడు. భయంతో బర్ఖాకి ఒళ్లంతా చెమటలు పట్టేశాయి. అతన్ని తోసేసి అక్కడి నుండి బయటపడేసరికి బర్ఖా గుండె చేతుల్లోకి వచ్చినంత పనైంది.

చుట్టూ భవనాలు .. వాటినిండా జనాలు ..

అయినా ఆ క్షణం బర్ఖా ఒంటరినని భావించింది. వెంటనే తన స్నేహితురాలు మరో గిగ్ శ్రామికురాలైన మిస్తీకి ఫోను చేసింది. 'ఇప్పటికీ ఆ రోజు తలుచుకుంటే ఇంకా నా ఒళ్లు వణికిపోతుంది' అని చెబుతున్న బర్ఖా ఆ రోజు కంపెనీ హెల్ప్ లైన్‌కు ఫోను చేయకుండా మిస్తీకే ఎందుకు ఫోను చేసింది?

మనిషి మారింది .. అంతే ..: మిస్తీకి కూడా బర్ఖా వయసే. ఒక ఆదివారం మధ్యాహ్నం బుక్ చేసుకున్న ఇంటికి తను వెళ్లింది. ఆ బుకింగ్ ఆ రోజులో నాలుగవది. అక్కడ ఇంట్లో ఒక పొడవాటి వ్యక్తి ఉన్నాడు. 'ఇంట్లో ఏ పని చేయాల'ని తను అడిగింది. అక్కడంతా చిందరవందరగా ఉంది. వంటగది సింక్ నిండా సామాను పడేశారు. అయితే ఆ వ్యక్తి ఆ పనులేవీ మిస్తీ చేయక్కర్లేదు అని చెప్పాడు. యాప్ సేవల్లో ఏదైనా గందరగోళం జరిగిందేమోనని ఆమె భావించింది. 'అయితే మీకు నేను ఏ పని చేయాలి' అని కాస్త అసహనంగా అడిగింది. అప్పుడు 'నువ్వు నా పర్సనల్ పని చేయాలి. మసాజ్ కావాలి' అని అతను చెప్పాడు. ఆ సేవలకు మరో స్లాట్ బుక్ చేసుకోవాలని తను చెప్పింది. అయినా అతడు వినలేదు. 'ప్రత్యేకంగా డబ్బులు ఇస్తాను. నువ్వే చెయ్యి' అని పట్టుబట్టాడు. మిస్తీ ఒప్పుకోలేదు. 'సరే అయితే ఆ బట్టలు కాస్త సర్దిపెట్టు' అని లోపలికి దారి చూపించాడు. అమాయకంగా మిస్తీ ఆవైపు వెళ్లింది. అంతే ఉన్నఫళాన ఆ వ్యక్తి తనని గదిలోకి తోసేశాడు. అక్కడ ఏం జరుగుతుందో మిస్తీకి అర్థం కాలేదు. తలుపులు గట్టిగా వేస్తున్న అతన్ని పట్టుకుని వెనక్కిలాగి బయటకు పరుగెత్తింది. బర్ఖా, మిస్తీ ఎదుర్కొన్న ఈ వేధింపులు వాళ్ల ఇళ్లల్లో చెప్పలేదు. చెబితే పనికి పంపించరన్న భయం. ఆ పని లేకపోతే ఇల్లు గడవదు అన్న ఆందోళన వారి నోళ్లు నొక్కేసింది. గిగ్ మహిళా కార్మికుల్లో ఎవరో ఒకరు ఎప్పుడో ఒకప్పుడు ఈ బాధ అనుభవించే ఉంటారు.

వేధింపులు సర్వసాధారణం: 2018లో 291 మంది గిగ్ మహిళా కార్మికులపై పిఆర్ఐఎతో కలసి మార్తా ఫర్రేల్ అనే స్వచ్ఛంద సంస్థ ఓ సర్వే చేసింది. గురుగ్రామ్, ఫరీదాబాద్, దక్షిణ ఢిల్లీలో పనిచేస్తున్న కార్మికుల్లో 29 శాతం మంది తమపై లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. 65 శాతం కంటే ఎక్కువ మంది తాము నిత్యం బెదిరింపులను ఎదుర్కొంటున్నట్లు వాపోయారు.

మిస్తీ తనకు ఎదురైన అనుభవం గురించి కంపెనీకి ఫిర్యాదు చేసింది. వారు అతన్ని బ్లాక్ చేశారు. అయితే దానిపై మిస్తీ ఇలా మాట్లాడుతోంది. 'బ్లాక్ చేయడం వల్ల ఏం జరగలేదు. అతను అక్కడే ఉంటాడు. నేను ఆ ఇంటి చుట్టుపక్కల బిల్డింగుల్లో పనులకు వెళ్లాలి. ఒక్కోసారి తనని చూసి భయంతో దూరమైనా సరే, వేరే దారి గుండా బుక్ చేసుకున్న ఇళ్లకు వెళ్తాను' అంటోంది.

చెప్పినా పట్టించుకోరు ..: హెల్ప్ లైన్ గురించి కూడా మిస్తీ చెప్పింది 'రోజుకు 15 మంది బాధితులు కంపెనీ సూచించిన 'ఎస్ఓఎస్' బటన్ ప్రెస్ చేస్తున్నారు. ఇది ఇబ్బందులు ఉన్న వారి కోసం కంపెనీ చెప్పిన హెల్ప్‌లైన్. ఆ రోజు నేను బటన్ నొక్కినప్పుడు అవతల ఒక మగ వ్యక్తి నాతో మాట్లాడారు. అతను పదే పదే నన్ను గుచ్చి గుచ్చి ప్రశ్నలు అడిగాడు. కస్టమర్ మిమ్మల్ని ఎక్కడెక్కడ తాకాడు? ఏం మాట్లాడాడు? అని అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు' అని మిస్తీ చెబుతోంది. ఇలాంటి ఫిర్యాదులు పోలీసు స్టేషను వరకు వెళ్లవు. కేవలం కస్టమర్ నంబరును బ్లాక్ చేసి కంపెనీలు చేతులు దులుపుకుంటాయి అంతే .. వాళ్ల చుట్టూ భయంతో పనిచేస్తున్న మహిళలను మాత్రం ఎవరూ పట్టించుకోరు.

పార్కుల్లో బెంచీలపైనే ..: బుకింగ్ కోసం ఈ మహిళలు ఆ ప్రాంతంలోని పబ్లిక్ పార్కుల్లో వేచి ఉంటారు. వాళ్లందరివి ఒకటే బాధలు. ఉదయం ఇంటి నుండి తెచ్చుకున్న భోజనం బాక్సు, చిన్న నీళ్ల సీసా ఉన్న ఓ బ్యాగు, చేతిలో స్మార్ట్ ఫోను. ఇవే ఆ మహిళ దగ్గర కనిపించే వస్తువులు.

పిల్లల చదువు కోసం, కుటుంబానికి సాయం కోసం వచ్చిన వివాహితులు, విపత్కర పరిస్థితుల్లో కుటుంబ భారమంతా మోసే అవివాహితులు ఎందరో నిత్యం రాష్ట్రాలు దాటి మెట్రో నగరాలకు వలసలు వస్తారు. ఫ్యాక్టరీల్లో పనుల కంటే గిగ్ పని సురక్షితం, ఆదాయం ఉంటుందన్న భరోసాతో ఈవైపు అడుగులు వేస్తున్నారు. కానీ ఇక్కడా వారికి చేదు అనుభవమే ఎదురవుతోంది. భద్రత, భరోసా లేని వాతావరణంలో బిక్కుబిక్కుమంటున్న ఈ మహిళలు సురక్షితంగా జీవించే రోజులు ఎప్పటికి వస్తాయో ..!

# ఇండియాలో ఫస్ట్...

## మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్

**నెల్లూరు,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు వేదిక అయింది. దేశీయ సముద్ర సాంకేతికత , రక్షణ రంగ ఉత్పత్తిని బలోపేతం చేసే దిశగా, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సమీపంలో ప్రపంచంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైమ్ షిప్‌బిల్డింగ్ అండ్ సిస్టమ్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బోగోలు మండలం బంగాళాఖాతం తీరంలో ఈ కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూమిపూజ నారా లోకేష్ చేతుల మీదుగా జరిగింది. దాదాపు 29.58 ఎకరాల విస్తీర్ణంలో మొదటి విడతగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులో స్వయంప్రతిపత్తి కలిగిన నౌకల నిర్మాణం , పరిశోధన మరియు అభివృద్ధి , షిప్ మెయింటెనెన్స్ అండ్ రిపేర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో ఉండనున్నాయి. ప్రధానంగా రక్షణ, వాణిజ్య , తీరప్రాంత భద్రతా అవసరాల కోసం మానవరహిత ఉపరితల నౌకలు, అటానమస్ అండర్ వాటర్ వెహికల్స్ డిజైన్ చేయడం, నిర్మించడంపై ఈ కేంద్రం దృష్టి సారించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెరైన్ రోబోటిక్స్ వంటి అధునాతన సాంకేతికతలను ఇక్కడ వినియోగించనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా భారీ ఊతం లభించనుంది. దీని ద్వారా దాదాపు 300 మందికి పైగా ఇంజనీర్లు, నేవల్ ఆర్కిటెక్టులు , ఇతర సాంకేతిక నిపుణులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అంతేకాకుండా, ఇక్కడి ఎంఆర్‌ఓ ఫెసిలిటీ వల్ల స్థానిక మత్స్యకారుల బోట్లు, కోస్ట్‌గార్డ్ , నేవీ నౌకల మరమ్మతులు వేగంగా జరిగి, పనిదినాల నష్టం తగ్గుతుంది. మత్స్యకారులకు రియల్ టైమ్ ఫిష్ లొకేషన్ మ్యాప్స్, శాటిలైట్ వెదర్ అలర్ట్స్ వంటి సాంకేతిక సాయం కూడా అందనుంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నెల్లూరు జిల్లా అంతర్జాతీయ సముద్ర సాంకేతిక చిత్రపటంలో కీలక స్థానాన్ని ఆక్రమిస్తుంది. అత్యాధునిక సెన్సార్ ఇంటిగ్రేషన్, నావిగేషన్ సిస్టమ్స్ మరియు రిమోట్ కంట్రోల్ టెక్నాలజీలతో రూపొందే ఈ నౌకలు సముద్ర నిఘా, మైన్ డిటెక్షన్ , లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి కీలకమైన కార్యకలాపాల్లో దేశానికి రక్షణ కవచంలా మారనున్నాయి


## అక్రమంగా నిల్వ వుంచిన గ్యాస్ సిలిండర్లు సీజ్

**తిరుపతి,తెలంగాణ దిశ :** తిరుపతి రూరల్ (మం) వేదాంతపురంలో సివిల్ సప్లై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. భారత్ గ్యాస్ గోడౌన్లో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసారు. మొత్తం 1056 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన సిలిండర్ల విలువ సుమారు రూ. 19.70 లక్షలు . స్వాధీనం చేసుకున్న వాటిలో 312 డొమెస్టిక్, 744 కమర్షియల్ సిలిండర్లు వున్నాయి. అనుమతి లేకుండా ఇతర కంపెనీ సిలిండర్లను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. గోడౌన్ కు సివిల్ సప్లై శాఖ నుండి ఎలాంటి అనుమతులు లేవని గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు గోడౌన్ను జిల్లా అధికారి శేషాచల రాజు సీజ్ చేసారు. గోడౌన్ నిర్వాహకుడు గోపీనాథ్ రెడ్డిపై చర్యలకు ఆదేశించారు.

# యుద్ధంతో అరటి రైతు కుదేలు

**- 20 రోజుల క్రితం కిలో రూ.23**

**- ప్రస్తుతం రూ.5కు కూడా కొనేనాథుడు కరువు**



**కళ్యాణదుర్గం,తెలంగాణ దిశ :** పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగు, కోత కూలి కలుపుకొని సుమారు రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు లక్ష రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. అది కూడా మొదటి పంట అయితేనే ఈ ధర వస్తుంది. పంట కొనుగోలుకు వ్యాపారి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే ఎండ తీవ్రతకు నెల రోజుల్లో గెలలు నేలకొరిగే ప్రమాదం ఉంది. రెండు, మూడో ఏడాది పంటను అడిగేవారు కరువయ్యాడు.

కొనేందుకు ముందుకురాని వ్యాపారులు: నాలుగు ఎకరాల్లో మైక్రోసన్ అరటిని సాగు చేశాను. పంట కోత దశలో నాణ్యతగా ఉంది. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. వారం ముందు వరకు వ్యాపారులు టన్ను రూ.20 వేలకు అడిగారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేస్తే ధర పడిపోయిందంటూ టన్ను ఐదు వేల రూపాయలకు కూడా కొనుగోలుకు ముందుకురాలేదు. పంట కోయకపోతే గెలలు నేలకొరిగిపోయి పూర్తిగా నష్టపోతాను.

# ఏ పార్టీ చూసిన అంతేగా... అంతేగా

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** అనగనగా ఒక రాజు. ఓరోజు దర్బారులో పంచాయితీ నిర్వహిస్తున్నారు. ఓ దొంగతనం కేసులో అందరినీ విచారిస్తున్నారు. ఇంతకీ జరిగిన దొంగతనం ఏంటంటే.. ఓ రైతు మామిడి తోటలో కొందరు అక్రమంగా ప్రవేశించి మామిడి కాయలను దొంగిలించారు. ఆ తర్వాత వాటిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ రైతు రాజుకు విన్నవించాడు. దీంతో పుర్వాపరాలు కనుకున్న రాజు దొంగతనం పంచాయతీని విచారించడం మొదలు పెట్టారు. అనుమానితులను పంచాయతీలో ప్రవేశపెట్టారు. ఒక్కొక్కరిని విచారించారు.

అందరూ పొంతనలేని వివరాలు చెప్పారు. అయితే మామిడి కాయలను దొంగిలించామనే విషయాన్ని చెప్పకుండా విక్రయించిన విషయాన్నిఒప్పుకున్నారు. ఇదే విషయాన్ని పట్టుకున్న రాజు.. పదే పదే వారిని అడగడంతో మామిడికాయలను దొంగిలించామని ఒప్పుకున్నారు.రాజు విచారిస్తున్న సమయంలో ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఎవరూ తాము దొంగతనానికి పాల్పడలేదని చెప్పారు. ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే.. తెలంగాణ రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పార్టీ, బాధిత పార్టీ చెబుతున్న మాటలు, వల్లె వేస్తున్న సుభాషితాలు అలాగే ఉన్నాయి మరి.వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరదీశారు. దుగ్యాల శ్రీనివాసరావు నుంచి మొదలు పెడితే సంతోష్ వరకు అందరూ కాంగ్రెస్ లో చేరారు. నాడు కేసీఆర్ ఆ పరిణామం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీలోకి ఎలా తీసుకుంటారు? పార్టీ ఫిరాయింపులకు ఎలా పాల్పడతారు అని ప్రశ్నించారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఫిరాయింపులకు గేట్లు తెరిచారు కేసీఆర్. టీడీపీ నుంచి మొదలు పెడితే వైసీపీ వరకు ఏ పార్టీని వదలకుండా అందరినీ వదలకుండా కొనేశారు. శాసనసభలో, శాసనమండలిలో ప్రతిపక్షం అనేది లేకుండా చూసుకున్నారు.తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కేసీఆర్ పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. అంతే కాదు, కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పచ్చజెండా ఊపింది. దీంతో గులాబీ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పల్లవి పాడారు. దీనిని ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. అనేక దఫాలుగా కేసును విచారించిన సుప్రీం కోర్టు నిర్ణయాధికారాన్ని స్పీకర్ కు వదిలేసింది. స్పీకర్ అనేక రకాలుగా విచారించి.. గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు అని చెప్పడానికి రుజువులు లేవని తేల్చి పడేశారు.ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాస్వామ్యం సర్వనాశనమైందని విలపిస్తోంది. కానీ, అధికారంలో ఉన్నప్పుడు గులాబీ పార్టీ ఏ చేసింది? గులాబీ దళపతి ఎలాంటి వ్యాఖ్యలు చేశారు? అనే విషయాలను మర్చిపోతే ఎలా? ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో మాట్లాడే నైతికత గులాబీ పార్టీకి లేదు. సమర్థించుకునే స్థాయి కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రంలేదు. ఎందుకంటే అందరూ గురవింద గింజలే.

# హోటల్ బిల్స్ లో గ్యాస్ డబ్బులు

చెన్నై,: టిఫిన్ చేయడానికి హోటల్‌కు వెళ్తే.. బిల్లులో టిఫిన్, జీఎస్టీతో పాటు గ్యాస్ సప్లయ్ ఛార్జీలను కూడా నిర్వాహకులు యాడ్ చేసిన ఘటన చెన్నైలో చోటుచేసుకుంది. హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వచ్చిన ఓ కస్టమర్ ఇడ్లీ, వడ తిన్నాడు. తర్వాత బిల్లు ఇవ్వాలని అడిగినప్పుడు హోటల్ నిర్వాహకుడు అతని బిల్లులో టిఫిన్, జీఎస్టీతో పాటు అదనంగా గ్యాస్ సప్లయ్ బిల్లును కూడా యాడ్ చేసి ఇచ్చాడు. అది చూసిన కస్టమర్ ఒక్కసారిగా షాక్ అయ్యాడు. అనంతరం బిల్ పే చేసి దాని ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

దీంతో ఇందుకు సంబంధించిన ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో చెక్కర్లు కోడుతోంది.వివరాల్లోకి వెళ్తే.. స్థానికంగా నివాసం ఉంటున్న ఓ వ్యక్తి చెన్నైలోని 'గీరాస్' రెస్టారెంట్‌కు టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. అతను ఇడ్లీ, వడ తిన్న తర్వాత హోటల్ నిర్వాహకుడు ఇచ్చిన బిల్ చూసి కంగుతిన్నాడు. ఆ బిల్లులో ఇడ్లీ, వడతో పాటు 'గ్యాస్ ఛార్జ్' పేరుతో అదనంగా మరో రూ.10 యాడ్ చేశాడు. ఇక చేసేదేమిలేక కస్టమర్ ఆ మొత్తాన్ని చెల్లించాడు.ఒక్క చెన్నైలోనే కాదు దేశవ్యాప్తంగా చాలా ప్రధాన నగరాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. ఇటీవలే కర్ణాటక రాజధాని బెంగళూరులో సైతం ఇలాంటి ఘటనే వెలుగు చూసింది. నగరంలోని ఓ హోటల్ భోజనం చేసేందుకు వెళ్లిన ఓ కస్టమర్‌కు గ్యాస్ ఛార్జీ పేరుతో ఏకంగా రూ.30 వరకు అదనంగా వసూలు చేశారట. గ్యాస్ కొరత నేపథ్యంలో హాస్టల్‌లో ఫుడ్ పెట్టట్లేదని హోటల్‌కు వెళ్తే.. అక్కడి నిర్వాహకులు నిండా దోచుకుంటున్నారని సదురు వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. అందుకు సంబంధించిన బిల్‌ను సిటీ పోలీసులకు ట్యాగ్ చేస్తూ సదురు కస్టమర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

అయితే సోషల్ మీడియాల్‌లో ఈ గ్యాస్ బిల్లులకు సంబంధించిన పోస్ట్‌లు తెగ వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన నెటిజన్లు హోటల్ నిర్వాహకుల తీరుపై మండి పడుతున్నారు.

## ఆర్టీసీలో సమ్మె నోటీస్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసు ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న నేతృత్వంలో ఆర్టీసీ కార్మికులు బస్ భవన్‌లో అధికారులను కలిశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ వెంటనే చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. అలాగే 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు.సమ్మె నోటీసులో ఆర్టీసీ కార్మికులు కీలక డిమాండ్లు ప్రస్తావించారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న 'మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా అందించే నిధులను కోత లేకుండా ఇవ్వాల న్నారు. ప్రభుత్వ తరుపున ఆర్టీసీకి రావాల్సిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత తోపాటు ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని కోరారు. ఇక అన్ని కేటగిరీల్లోని సిబ్బందిపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.



# 'బిపిసిఎల్' ప్రాజెక్టుకు ఎదురుదెబ్బ?

**నెల్లూరు,తెలంగాణ దిశ :** నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం వద్ద ఏర్పాటు చేయనున్న భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ప్రాజెక్టుకు మంత్రివర్గ కమిటీ బ్రేక్ వేసింది. ప్రజలను, ప్రజా ప్రతినిధులను, రాజకీయ పార్టీల ప్రతినిధులను ఎవరినీ ప్రజాభిప్రాయసేకరణకు రానివ్వకుండా అంతా కంపెనీ ప్రతినిధులతో తూతూ మంత్రంగా నిర్వహించిన సేకరణకు ఎదురుదెబ్బతగలింది. 30 రోజుల్లో మళ్లీ ప్రజల అభిప్రాయాలు తీసుకొని పూర్తి నివేదక పంపాలని మంత్రివర్గ కమిటీ ఆదేశాలు జారీ చేసింది. ప్రజల ముందు పూర్తి సమాచారం పెట్టి ఆమోదం తీసుకోవాలని చెప్పడంతో కంపెనీ ప్రతినిధులు కుయ్యో.. మొర్రో అంటున్నారు. ప్రజలకు కంపెనీ గురించి కనీస సమాచారం ఇవ్వకుండా అంతా గోప్యంగా జరిపి ఇప్పటి వరకు నివేదక ఇవ్వలేదు.బిపిసిఎల్ కంపెనీ రామాయపట్నం కేంద్రంగా పెట్రోల్ రీఫైనల్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది.. ఇందుకోసం 6000 ఎకరాలు భూసేకరణ పూర్తి చేసి కంపెనీ ప్రతినిధులకు అధికారులు అప్పగించారు. చేవూరు, రావూరు, ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు 2025 డిసెంబర్‌లో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించారు. ఇందులో ఎపి పొల్యూషన్? కంట్రోల్ బోర్డు (ఎపిపిసిబి) ప్రతినిధులు హాజరయ్యారు. ఆరోజు గ్రామస్తులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలను ఎవరినీ అటు వైపు రానివ్వకుండా తమకు అనుకూలమైన వ్యక్తులు, కంపెనీ ప్రతినిధులు, అధికారపార్టీ ఎంఎల్ఎ అనుచరులతో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశారు. ప్రజల ముందు పూర్తి నివేదిక పెట్టాల్సి ఉంది.

ఆ రోజు అలాంటి కార్యక్రమాలు ఏమీ చేయకుండా కేవలం తూతూ మంత్రంగా పబ్లిక్ హియిరింగ్ ముగించారు. ఇప్పటి వరకు మినిట్ బయటకు రాలేదు. కంపెనీ అనుమతుల కోసం వెళ్లిన ప్రతినిధులకు అనుమతులు ఇవ్వకుండా పక్కనపెట్టినట్లు తెలిసింది. మళ్లీ ప్రజల ముందు ఉంచి అభిప్రాయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ (టిఒపి) 30 రోజులు గడువు ఇచ్చింది. ఎపిపిసిబి నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రజలకు వాస్తవాలు చెప్పి, వారి అభిప్రాయాలు తీసుకోవాలని ఆదేశించారు. ఈనెల 6న నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వాల్యుమ్ 2 లోనూ ప్రజలకు జరిగే నష్టాలను స్పష్టం చేయలేదు. ఇది కేవలం పెట్రోల్ రిఫైనరీ కాకుండా, అందులో పెట్రోల్ కెమికల్ ప్రాజెక్టు వస్తుంది. ఈ ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాలను ప్రజలకు ఎక్కడా వివరించలేదు. ప్రభుత్వానికి పంపిన నివేదకలోనూ ఎక్కడా చూపిం చలేదని తెలిసింది. స్థానిక అధికారపార్టీ ఎంఎల్ఎ, వారి అనుచరులను పెట్టకొని పబ్లిక్ హియిరింగ్ జరిగిందని రికార్డులు సృష్టించారు. దీనిని కమిటీ తప్పుపట్టినట్లు సమాచారం. 2003లో కృష్ణపట్నం వద్ద పివిసి ప్రాజెక్టు రూ.1.75 లక్షల ఇథనాల్ ప్రాజెక్టును ప్రజలు వ్యతిరేకించారు. బిపిసిఎల్ ప్రాజెక్టులో అంతకన్నా మూడు రెట్లు ఇథనాల్ వస్తుందని తెలుస్తోంది. ఇది ఎంత ప్రమాదకరమో తెలుస్తోంది. బిపిసిఎల్ ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాలను ఎక్కడా చూపించకుండా అనుమతుల కోసం కంపెనీ ప్రతినిధులు చేస్తున్న ప్రయత్నానికి చుక్కెదురైంది. ఇతర దేశాల నుంచి క్రూడాయిల్ రామాయపట్నం పోర్టుకు వస్తుంది. అక్కడ నుంచి బిపిసిఎల్ కంపెనీ చమురును :శుద్ధి చేస్తుంది. పెట్రోల్, డీజిల్, క్రూడాయిల్, ఎల్‌పిజి, న్యాఫ్‌గా విడగొడతారు. పెట్రో కెమికల్స్ వస్తుంది. దీని నుంచి ఇథలిన్, పాలీ ఇథలిన్, పివిసి, థైరిన్ వంటి ప్రమాదకరమైన రసాయనాలు బయటకు తీస్తారు. వీటిని అత్యంత జాగ్రత్తగా నిల్వచేయాల్సి ఉంటుంది. కనీస ప్రమాణాలు పాటించకపోతే ఇటీవల విశాఖపట్నంలో జరిగిన థైరిన్ ప్రమాదం ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు.

# కేడర్ లో అసంతృప్తి..

**కాకినాడ,తెలంగాణ దిశ :** జనసేన పార్టీఆవిర్భావ దినోత్సవం అంటే ఆ పార్టీ కేడర్‌కు ఒక పండగ. అణచివేతను ఎదిరించి, ప్రశ్నించే గొంతుకగా పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో, ఈసారి పిఠాపురం వేదికగా జరిగే వేడుకలు రాజకీయంగా పెను సంచలనం సృష్టిస్తాయని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా పార్టీ అధిష్టానం ఈ వేడుకలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం జనసైనికులను తీవ్రగ్ర్భాంతికి గురిచేసింది.రాష్ట్ర రాజకీయాల్లో జనసేన గ్రాఫ్ పెరుగుతున్న తరుణంలో, ఈ నెల 14న పిఠాపురంలో జరగాల్సిన పార్టీ ఆవిర్భావ సభ రద్దు కావడం చర్చనీయాంశంగా మారింది. స్వయంగా అధినేత పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఈ సభ పార్టీ బలోపేతానికి ఒక దిక్సూచిలా మారుతుందని కేడర్ ఎంతో ఆశగా ఎదురుచూసింది. కానీ, ప్రస్తుత నిర్ణయం కార్యకర్తల ఉత్సాహంపై నీళ్లు చల్లిందనే చెప్పాలి.పార్టీ అధికారికంగా చెబుతున్న ప్రధాన కారణం సభ్యత్వ నమోదు. ఇప్పటివరకు దాదాపు 8.70 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు గడువు రేపటితో ముగియాల్సి ఉన్నా, లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ గడువును పొడిగించే ఆలోచనలో అధిష్టానం ఉంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలంటే గణాంకాలు ముఖ్యం కాబట్టి, సభ ఏర్పాట్ల కంటే సభ్యత్వాలపైనే పూర్తి దృష్టి పెట్టాలని పవన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.అయితే సభ రద్దు వెనుక ఇతర బలమైన కారణాలున్నాయని సమాచారం. సభ్యత్వ నమోదుతో పాటు మరికొన్ని అంశాలు కూడా ఇందుకు దోహదం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. వేలాదిగా తరలివచ్చే కేడర్‌కు ఎండ దెబ్బ తగలకుండా చూడటం అధినేత బాధ్యతగా భావిస్తున్నారు. రాష్ట్రంలో జరిగిన కల్తీ పాలు, బాణాసంచా పేలుడు ఘటనలు పార్టీ వర్గాల్లో కొంత ఆవేదనను నింపాయి. ఇలాంటి సమయంలో భారీ వేడుకలు నిర్వహించడం సబబు కాదని పార్టీ భావించి ఉండవచ్చు. పిఠాపురం పవన్ కల్యాణ్ సొంత నియోజకవర్గం కావడంతో, అక్కడ ఎలాంటి అపశ్రుతులు జరగకూడదని, అత్యంత పకడ్బందీగా మరోసారి పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. జనసేన పార్టీకి భావోద్వేగాలే బలం. పవన్ కల్యాణ్ పిలుపు కోసం ఎదురుచూసే లక్షలాది మంది యువత, పిఠాపురం వేదికగా ఆయన ఇచ్చే పొలిటికల్ స్పీచ్ కోసం సిద్ధమయ్యారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇలాంటి భారీ బహిరంగ సభలు కార్యక ర్తల్లో కొత్త జోష్ నింపుతాయి. ఇప్పుడు సభ రద్దు కావడంతో, క్షేత్రస్థా యిలో కేడర్ డీలా పడిపోయింది. పార్టీ బలోపేతం ముఖ్యమే కానీ కార్యకర్తల ఆత్మీయ కలయిక కూడా అంతే ముఖ్యమనేది సగటు జనసైనికుడి ఆవేదన.నిర్ణయం కఠినంగా ఉన్నా,పార్టీ దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా పవన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. సభ రద్దుతో వచ్చిన అసంతృప్తిని పోగొట్టాలంటే, సభ్యత్వ నమోదులో రికార్డు సృష్టించడమేకాకుండా, త్వరలోనేమరో భారీ మేనిఫెస్టో సభ లేదా ప్లీనరీ లాంటి కార్యక్రమాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది.

# ఉల్పర వాగు నుంచి అక్రమ ఇసుక రవాణా?




**వంగూర్,తెలంగాణ దిశ :** మండల పరిధిలోని ఉల్పర వాగు నుంచి ఎలాంటి అనుమతు లు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లు ఉపయోగించి పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా పక్కనపెట్టి కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టంకలిగిస్తున్నారని వారు పేర్కొన్నారు.ఇసుక అక్రమరవాణా కారణం గా వాగు పరిసర ప్రాంతాల్లో పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం కలుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయాన్ని గమనించినప్పటికీ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఉల్పర వాగు నుంచి జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

# ట్రెండింగ్ లో చైనా ప్రొఫెసర్ ప్రిడిక్షన్

బీజింగ్: ఇరాన్, అమెరికా యుద్ధం 11వ రోజుకు చేరింది. ఇటు ఇరాన్, అటు అమెరికా వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్ అణు కార్యకలాపాలు కొనసాగిస్తోందన్న సాకుతో అమెరికా ఈ యుద్ధం మొదలు పెట్టింది. మొదటి రోజే ఇరాన్ సుప్రీం లీడర్‌ను మట్టుబెట్టినా ఇరాన్ వెనక్కు తగ్గడం లేదు. అమెరికాతోపాటు అమెరికాకు మద్దతుగా ఉన్న ఇజ్రాయెల్, యూఏఈ,ఖతార్, సౌదీ అరేబియా, దుబాయ్, బహ్రెయిన్‌తోపాటు 14 దేశాలపై దాడులు చేస్తోంది. యుద్ధం నాలుగు వారాలు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. తాజాగా యుద్ధం సెప్టెంబర్ వరకు కొనసాగే అవకాశం ఉందని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ యుద్ధంలో ఎవరు గెలుస్తారన్న చర్చ మొదలైంది.చైనా విశ్లేషకుడు ప్రొఫెసర్ జియాంగ్ ఇరాన్ అమెరికా యుద్ధంపై 2024లో చేసిన ప్రెడిక్షన్ ఇప్పుడు వైరల్‌గా మారింది. 2024 మేలో ట్రంప్ మళ్లీ అధ్యక్షుడవుతాడని, అమెరికా?ఇరాన్ యుద్ధం జరుగుతుందని, అమెరికా ఓడిపోతుందని జియాంగ్ ఊహించాడు. మొదటి రెండు సంభవించాయి, మూడోది జరిగే అవకాశం ఉందని సోషల్ మీడియా వైరల్. ఇరాన్ అసిమెట్రిక్ ఆయుధాలు, ప్రాక్సీలతో పోరాడుతుందని చెప్పాడు.ఇరాన్ పర్వతాలు, విశాల భూభాగం ఆక్రమణకు మలుపిస్తాయి. మిలియన్ల సైన్యం అవసరమని జియాంగ్ అంచనా. అమెరికా దూరం వల్ల లాజిస్టిక్స్ సమస్యలు తలెత్తుతాయి. గల్ఫ్ ఆయిల్ కేంద్రాలు, ఆర్మూజ్ జలసంధి మూతపడితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.ఏథెన్స్ స్పార్టాతో పోల్చుకుని బలవంతుడైనా దూర యుద్ధంలో ఓడిపోయింది. దీర్ఘకాలం యుద్ధం కొనసాగడం, దూర ప్రాంతం నగరంపై దాడి చేయడం కారణంగా లాజిస్టిక్ సమస్యలు వచ్చాయి. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా ఏథెన్స్ ఓడిపోయింది. ఇదే పరిస్థితి అమెరికాకు వస్తుందని జియాంగ్ తెలిపారు. యుద్ధం కారణంగా అమెరికా రిసోర్సెస్ తగ్గుతూ, రష్యా?చైనా బలపడతాయని ప్రిడిక్షన్. ఇరాన్ గెలిచినా ప్రాంతీయ నష్టాలు తీవ్రం. యుద్ధం పొడిగితే ప్రపంచ చమురు ధరలు, ఆర్థిక అస్థిరత పెరుగుతాయి. జియాంగ్ ఊహలు నిజమైతే అమెరికా ఆధిపత్యం బలహీనపడుతుంది.

## దివాళా పథకాలకు అడ్డుకట్ట వేసేదెవరు

ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా..అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచితపథకాల గురింగి డిమాండ్ చేస్తున్నారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో ఏమేమి చేశామో అని కాంగ్రెస్ వివరించింది. విపక్ష బిఆర్ఎస్ మాత్రం ఇవ్వని జాబితా చదివింది. తులం బంగారం ఇచ్చారా..రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీశారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. ఇకపోతే ఇప్పటి లక్షా 25కోట్ల అప్పుల చేశారని అంటున్నారు. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో ఫలానా పథకం ఆగిందని ఆరోపిస్తున్నారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఓటర్లకు ఆశ పెట్టి తాత్కాలిక లబ్దిని చేకూర్చడం ఎంతవరకు సబబో నేతలు ఆలోచన చేయడం లేదు. ఉచితాల పంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతు లెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఆధునిక భారతదేశం అంధకార యుగంలోకి జారిపోతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఒకా నొక సందర్భంలో ఆందోళన వ్యక్తం చేసారు. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించలేమని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ గతంలో హెచ్చరించారు. ఆనాడు దీనిని అనేక రాజకీయపార్టీలు కూడా వ్యతిరేకించాయి. మోడీకి సంక్షేమం పట్ల సానుకూల వైఖరి లేదని విమర్శించారు. కానీ ఎంతో విచిత్రంగా ఆ తర్వాత ఏడాది మధ్యప్రదేశ్‌లో లక్ష్మీమోహనాపథకం క్రింద మహిళలకు నెలకు రూ.1250 చొప్పున చెల్లిస్తామని, క్రమంగా దాన్ని రూ.3వేల వరకు పెంచుతామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. మొన్న మహారాష్ట్రలో కూడా ఇదేవిధంగా ఇలాంటి పథ కాన్నే ప్రకటించారు. బీహార్‌లో కూడా ఇలాంటి పథకంతోనే గట్టెక్కారు. అంతకు ముందు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడా అంతేచేసింది. దీన్నిబట్టి ఉచితాలను వ్యతిరేకించినవారే సమయాను కూలంగా వాటిని మళ్లీ తెరపైకి తెస్తున్నారు. నగదుబదిలీల వల్ల ప్రజల వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థకు ఎంతో కొంత తోడ్పడుతుందనే వాదన ఒకటి ఉన్నది.

# మూసీలో పొంగుతున్న రాజకీయ కాలుష్యం



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌కు ఇప్పుడు కొత్త జ్వరం పట్టుకుంది. అదే.. 'మూసీఫీవర్'. నదిని శుద్ధి చేస్తామని ఒకరు అంటే, ఆ ప్రాజెక్టు వెనుక 'అతివృష్టి' (అవినీతి) ఉందని మరొకరు, అసలు తాము వస్తే మూసీని 'అమృతం'లా మార్చేవాళ్ళమని ఇంకొకరు.. మొత్తానికి మూసీ నీళ్ళ కంటే, మూసీపై జరుగుతున్న రాజకీయ కాలుష్యమే ఇప్పుడు సిటీలో హాట్ టాపిక్.మన రాజకీయ నాయకులకు ఏదైనా ప్రాజెక్టు అంటే మొదట గుర్తొచ్చేది 'విగ్రహం'. మూసీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 5,000 కోట్లు దాటినా, ప్రతిపక్షాలకు మాత్రం అందులో కనిపించేది కేవలం ఒక విగ్రహం మాత్రమే! "అమ్మో! విగ్రహానికి వంద కోట్లా?" అంటూ ఒక వర్గం గగ్గోలు పెడుతుంటే, అటువైపు ప్రభుత్వం ఏమో "మేము చేసేది నది ప్రక్షాళన, విగ్రహం ఒక్కటే కాదు" అని వివరణ ఇచ్చుకోలేక పడుతున్న పాట్లు చూస్తుంటే.. అసలు ప్రాజెక్టు దేనికో, అది దేనికో అర్థం కాక సామాన్యుడు తల పట్టుకుంటున్నాడు.సీఎం రేవంత్ రెడ్డిఉద్దేశం చూస్తుంటే, హైదరాబాద్‌ను లండన్ థేమ్స్ నది రేంజ్‌లోకి తీసుకెళ్లాలని ఉంది. "సబర్మతిని అభివృద్ధి చేయొచ్చు, యమునను బాగు చేయొచ్చు.. మరి మన మూసీని ఎందుకు చేయకూడదు?" అని ఆయన అడుగుతుంటే, ప్రతిపక్షాలు "మీరు చేసేది అభివృద్ధి కాదు, 'లూటిఫికేషన్'" అని ఎదురుదాడి చేస్తున్నాయి. చివరకు పరిస్థితి ఎలా ఉందంటే, మూసీలో నీళ్లు పారడం సంగతి పక్కన పెడితే, మాటల యుద్ధం మాత్రం వరదలా పారుతోంది.ఏ రాజకీయ గొడవైనా చివరకు 'లీగల్ నోటీసుల' దగ్గర ఆగుతుంది. ప్రాజెక్టుపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ నేతలకు ఏకంగా లీగల్ నోటీసులు రావడంతో.. ఇప్పుడు అసలు పోరాటం 'వాస్తవాల' మీద జరుగుతుందా లేక 'కోర్టు మెట్ల' మీద జరుగుతుందా అనే అనుమానం రాక మానదు. ఆరోపణలు చేయడం, నోటీసులు రావడం, మళ్లీ ప్రెస్ మీట్లు పెట్టడం.. ఇదంతా చూస్తుంటే హైదరాబాద్ అభివృద్ధి ఏమో కానీ, లాయర్ల ఆదాయం మాత్రం ఖచ్చితంగా పెరిగేలా ఉంది! అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డిగారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వబోతు న్నారు. ప్రభుత్వం తన వాదనను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఫెయిల్ అయ్యిందనే విమర్శలకు, ఈ ప్రజెంటేషన్ చెక్ పెడుతుందా? లేక ఆ ప్రజెంటేషన్‌ను చూసి ప్రతిపక్షాలు మరో రకమైన విమర్శలకు సిద్ధమవుతాయా? అన్నదే అసలైన సస్పెన్స్.నది కలుషితమైతే నీటిని శుద్ధి చేయొచ్చు. కానీ, రాజకీయాల్లో కలుషితమైన అభిప్రాయాలను శుద్ధి చేయడానికి ఏ ప్లాంట్ పనికొస్తుంది? కేవలం విగ్రహాలు, విమర్శల చుట్టూ తిరిగితే, మూసీ ప్రక్షాళన అనేది నగరానికి ఒక 'స్వప్నం'గానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం చెప్పే 'గ్లోబల్ సిటీ' కల నెరవేరాలంటే, ప్రజలకు కావాల్సింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు మాత్రమే కాదు.. పారదర్శకమైన పాలన, క్షేత్రస్థాయిలో భరోసా!

# రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న అడవి పందులు

శాయంపేట : హన్మకొండ జిల్లా, శాయంపేట మండలంలోని రైతులకు అడవి పందులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా పత్తిపాక గ్రామంలో వీటి బీభత్సం రోజురోజుకు పెరుగుతోంది. గ్రామానికి చెందిన రైతు రావుల ఇంద్రసేనారెడ్డి సాగు చేసిన రెండు ఎకరాల మొక్కజొన్న పంటను అడవి పందులు పూర్తిగా నేలమట్టం చేశాయి. రాత్రి వేళల్లో గుంపులుగా పొలాల్లోకి దూసుకొస్తున్న అడవి పందులు పంటను పీకి, తొక్కి పాడుచేస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంట కోతకు దగ్గరలో ఉండగా ఇలా నాశనం కావడం వల్ల రైతులకు భారీగా నష్టం వాటిల్లిందని వాపోతున్నారు. వరుస ఘటనలతో గ్రామంలోని ఇతర రైతులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. అడవి పందులు తరచూ పొలాల్లోకి రావడంతో తమ పంటలకూ ఇదే పరిస్థితి వస్తుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలను కాపాడుకోవడానికి రాత్రంతా పొలాల్లో కాపలా కాస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. అడవి పందుల సమస్యను అరికట్టేందుకు సంబంధిత అటవీ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే నష్టపోయిన రైతుకు ప్రభుత్వం తక్షణమే పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# పసుమాములలో హైడ్రా కూల్చివేతలు..

**వనస్థలిపురం,తెలంగాణ దిశ :** మున్సిపల్? కార్పొరేషన్? (ఎంఎంసీ) నాగోల్? సర్కిల్?.. కుంట్లూర్? డివిజన్? పరిధిలోని పసుమాములలో శుక్రవారం 'హైడ్రా' కూల్చివేతలు చేపట్టింది. అబ్దుల్లాపూర్? మండల రెవెన్యూ పరిధిలో సర్వే నెం 454లో కళింగరావు అనే వ్యక్తి ప్లాట్లను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంతో 'శ్రీకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు హయత్?నగర్? పోలీసులతో కలిసి భారీ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కబ్జాదారుల నుంచి దాదాపు రూ.15 కోట్ల స్థలాన్నికాపాడి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితులు 'శ్రీకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ కమిషనర్? రంగనాథ్, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.




# అమెరికాలో వీసా మోసాలు

## 11మంది భారతీయుల అరెస్ట్ – నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు

వాషింగ్టన్:అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు.

# కవిత కద మళ్లీ మొదటికి



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు లిక్కర్ స్కామ్ కేసులో కవితతో పాటు ఇతర నిందితులను డిశ్చార్జ్ చేస్తూ తీర్పు నిచ్చింది. అయినా సీబీఐ అధికారులు హైదరాబాద్కు వచ్చి మరీ కవితకు నోటీసులు ఇచ్చారు. భారతీయ న్యాయ వ్యవస్థలో ట్రయల్ కోర్టు ఇచ్చే తీర్పులే చివరివి కావు. ఆ తీర్పులో లోపాలు ఉన్నాయని లేదా సాక్ష్యాలను సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేదని భావిస్తే, దర్యాప్తు సంస్థలు ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లే హక్కు ఉంటుంది. ఈ క్రమంలోనే సీబీఐ, ట్రయల్ కోర్టు ఇచ్చిన డిశ్చార్జ్ ఆర్డర్ను సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది.రెండో అంశం ఏమిటంటే, సీబీఐ స్వయంగా తన సొంత అధికారంతో ఈ నోటీసులు ఇవ్వలేదు. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ను విచారణకు స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు , ఈ కేసుపై ప్రతివాదుల వివరణ కోరుతూ నోటీసులు జారీ చేసింది. న్యాయస్థానాలు జారీ చేసిన ఇటువంటి అధికారిక నోటీసులను సంబంధిత వ్యక్తులకు చేరవేయడం దర్యాప్తు సంస్థ బాధ్యత. అందుకే సీబీఐ అధికారులు గురువారం హైదరాబాద్లోని కవిత నివాసానికి వెళ్లి కోర్టు ఆదేశాలను అందజేశారు.ఇక్కడ గమనించాల్సిన మరో విషయం న్యాయపరమైన ప్రక్రియనే. ట్రయల్ కోర్టు కేసును కొట్టేసినప్పుడు నిందితులు నిర్దోషులుగా విడుదలవుతారు. కానీ, పైకోర్టు ఆ తీర్పును పరిశీలించడానికి ఒప్పుకున్నప్పుడు ఆ కేసు మళ్ళీ సజీవమైనట్లే లెక్క. హైకోర్టు ఈ కేసులో సీబీఐ వాదనలు విన్న తర్వాత, ట్రయల్ కోర్టు తీర్పు సరైనదే అని భావిస్తే కేసు పూర్తిగా ముగుస్తుంది. ఒకవేళ ట్రయల్ కోర్టు నిర్ణయం తప్పని భావిస్తే, మళ్లీ విచారణ జరపాలని ఆదేశించే అవకాశం ఉంటుంది. అంటే ఇప్పుడు జరుగుతున్నది కేవలం తీర్పుపై జరుగుతున్న న్యాయపరమైన సమీక్ష మాత్రమే.చాలామందికి వచ్చే సందేహం ఏమిటంటే, నోటీసులు ఇచ్చిన వెంటనే అరెస్టు చేస్తారా? అని. ప్రస్తుతానికి సీబీఐ అందజేసినవి కోర్టుకు హాజరుకావాలని కోరుతూ ఇచ్చిన నోటీసులు మాత్రమే. ట్రయల్ కోర్టు ఇప్పటికే నిందితులను డిశ్చార్జ్ చేసినందున, హైకోర్టు మళ్లీ స్టే ఇవ్వకుండా లేదా ప్రత్యేక ఆదేశాలు జారీ చేయకుండా నేరుగా అరెస్టు చేసే అవకాశం ఉండదు. మార్చి 16న జరిగే విచారణలో ప్రతివాదులు తమ వాదనలను వినిపించాల్సి ఉంటుంది.ఈ పరిణామం న్యాయపోరాటంలో ఒక సాధారణ ప్రక్రియ. రాజకీయంగా దీనిపై ఆరోపణలు ఉన్నప్పటికీ, చట్టపరంగా చూస్తే ప్రాథమిక కోర్టు తీర్పును ఉన్నత కోర్టులో సవాలు చేయడం దర్యాప్తు సంస్థల విధి. అందుకే కేసు కొట్టేసినా కూడా, ఆ తీర్పు చెల్లుబాటును తేల్చడానికి హైకోర్టు జోక్యం చేసుకుంది. దీనివల్ల నిందితులకు తక్షణమే శిక్ష పడదు కానీ, వారు మళ్లీ కోర్టు మెట్లు ఎక్కి తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ వెంటనే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. సీబీఐ దాఖలు చేసిన ఈ అప్పీల్ పిటిషన్ను విచారణకు స్వీకరించిన హైకోర్టు, ఈ వ్యవహారంపై స్పందించాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ అధికారులు కవిత ఇంటికి వెళ్లి మార్చి 16న విచారణకు హాజరు కావాలని సమన్లు అందజేశారుసాధారణంగా ఒక కేసును ట్రయల్ కోర్టు కొట్టేసినప్పుడు, దర్యాప్తు సంస్థకు పైకోర్టులో అప్పీల్ చేసుకునే హక్కు ఉంటుంది. ఒకవేళ పైకోర్టు ఆ అప్పీల్ను విచారణకు అర్హమైనదిగా భావిస్తే, నిందితులకు నోటీసులు జారీ చేసి వారి వాదనలు వింటుంది. ఈ న్యాయ ప్రక్రియలో భాగంగానే సీబీఐ ఇప్పుడు తన అప్పీల్ పిటిషన్పై విచారణ కోసం నోటీసులు అందజేసింది. దీని అర్థం పాత కేసు మళ్లీ పునఃప్రారంభమైనట్లు కాకపోయినా, తీర్పును సవాలు చేస్తూ జరుగుతున్న న్యాయపోరాటంలో ఇది ఒక కీలక దశ.కీలకమైన సాక్ష్యాలను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోలేదని, అందుకే తాము పైకోర్టును ఆశ్రయించామని సీబీఐ వాదిస్తోంది. మార్చి 16న జరిగే విచారణలో ఢిల్లీ హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# యుద్ధం ఎఫెక్ట్... మామిడి రైతుల విలవిల

**విజయవాడ,తెలంగాణ దిశ :**దేశ విదేశాల్లో తెలుగు వాళ్లు ఎక్కడున్నా మార్చి నెల రాగానే మామిడి కాయలే గుర్తొస్తాయి. తెలుగు వాళ్లే కాదు.. విదేశీయులు కూడా మన మ్యాంగోల కోసం ఎదురు చూడాల్సిందే..! ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్లోని పలు ప్రాంతాల నుంచి ప్రతి ఏటా విదేశాలకు టన్నుల కొద్దీ మామిడి ఎగుమతి అవుతూ ఉంటుంది. అందులోనూ.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఫుల్ డిమాండ్.. నూజివీడు రసాలు పేరు చెప్తే నోరూరాల్సిందే.. అందుకే.. ఇక్కడి నుంచి దేశ విదేశాలకు మన మామిడి ఎగుమతి అవుతుంది. దేశ విదేశాల్లోనూ మన మామిడి మస్తు గిరాకీ ఉండడంతో వ్యాపారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తారు. అయితే.. ఇదంతా గతేడాది వరకు.. ఇప్పుడు సీన్ మారిపోయింది. నూజివీడు మామిడి దిగుబడి భారీగా వచ్చే అవకాశం ఉన్నా.. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వార్ కారణంగా ఎగుమతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఎగుమతి దారులకు ఈసారి ఆర్డర్స్ భారీగా ఉన్నాయి. కానీ.. ఇరాన్, ఇజ్రాయెల్ వార్.. మామిడి ఎగుమతిపై తీవ్ర ప్రభావం పడుతుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే.. అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలకు మామిడి పండ్లు ఎక్కువగా ఆకాశ మార్గంలోనే ఎగుమతి అవుతుంటాయి. కానీ.. యుద్ధం కారణంగా ఇప్పటికే.. కొన్ని ఫ్లైట్స్ రద్దు కావటం, కొన్ని ఎయిర్వేస్లు ఛార్జీలు పెంచడం లాంటి పరిణామాలు ఇబ్బందిగా మారుతున్నాయి. ఆయా దేశాల్లో మామిడికి భారీగా డిమాండ్ ఉన్నా.. దానికి తగ్గట్టుగా ఎగుమతి చేయలేకపోతున్నామని ముంబైకి చెందిన ఎక్స్పోర్ట్ నిర్వాహకులు సమీర్ చెప్తున్నారు.వార్ ఎఫెక్ట్ నూజివీడు మామిడికి ఇబ్బందులు తెచ్చి పెడితే.. మహబూబ్నగర్ జిల్లా మామిడి రైతులను తెగుళ్లు సర్వనాశనం చేస్తున్నాయి. తీపి ఫలాలు పండించే కొల్లాపూర్ మామిడి రైతులకు నాలుగేళ్లుగా చేదు ఫలాలు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణం, పలు రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి గణనీయంగా



తగ్గుతోంది. కాయలతో నిండుగా కనిపించాల్సిన మామిడి చెట్లు.. వాడిపోయిన పూతలతో దర్శనమిస్తున్నాయి. ఎకరాలకు ఎకరాలు కాత, పూత లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. లక్షల పెట్టుబడితో ఏడాదంతా సాగు చేస్తే.. చివరికి చీడ, పీడలతో కూడిన చెట్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్లాపూర్ మామిడికి ప్రతి ఏటా ఫుల్ డిమాండ్ ఉంటుంది. ఈ క్రమంలోనే.. ఈ ఏడాది సుమారు 35వేల ఎకరాల్లో మామిడి పంట పండింది. నేల స్వభావం, నీటి లక్షణాలతో కొల్లాపూర్ మామిడికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. దేశీయంగా ఎంతో గుర్తింపు ఉన్న కొల్లాపూర్ మామిడి.. అమెరికా, మలేషియా, అరబ్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంది. కానీ.. గత నాలుగేళ్లుగా కొల్లాపూర్ మామిడి రైతులను తెగుళ్ల కష్టాలు వెంటాడుతున్నాయి.

నల్లతామర, తేనేమంచు, బూడిద తెగుళ్లు మామిడి పూతను పట్టి పీడిస్తున్నాయి. వాతావరణ మార్పులతో పూత, కాత దెబ్బ తినడం మామిడి రైతులకు ఇబ్బందిగా మారింది.మొత్తంగా.. ఒకవైపు.. కృష్ణా జిల్లా నూజివీడు మామిడికి ఇజ్రాయెల్-ఇరాన్ వార్ శనిలా మారితే.. మహబూబ్నగర్ జిల్లా కొల్లాపూర్ మామిడిని తెగుళ్లు, వాతావరణ మార్పులు పట్టి పీడిస్తు?న్నాయి. ఫలితంగా.. మామిడి రైతులను ఆదుకునేందుకు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు

# భర్తను పకోడీలు తెమ్మని చెప్పి.. మరో వ్యక్తితో భార్య పరార్




లక్నో: కొత్తగా పెళ్లైన యువ జంట బస్సులో బస్టాండ్కు చేరుకున్నారు. మరో బస్సు ఎక్కేందుకు వేచి ఉన్నారు. తనకు ఆకలిగా ఉన్నదని పకోడీలు తీసుకురావాలని భర్తకు భార్య చెప్పింది. అతడు కొని తెచ్చేసరికి మరో వ్యక్తితో ఆమె పారిపోయింది. దీంతో భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేశాడు. ఉత్తరప్రదేశ్లోని మొరాదాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్కు రాంపూర్ జిల్లాకు చెందిన 18 ఏళ్ల రిమ్జిమ్తో గత ఏడాది డిసెంబర్ 1న పెళ్లి జరిగింది. ఇటీవల హోలీ పండగ కోసం ఆమె తన పుట్టింటికి వెళ్లింది. కాగా, భార్యను ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రీతమ్ సింగ్ అత్తవారింటికి వెళ్లాడు. మార్చి 9న భార్య రిమ్జిమ్తో కలిసి బస్సులో ప్రయాణించాడు. మరో బస్సు మారేందుకు బిలారి బస్టాండ్ వద్ద వారు దిగారు. తమ ఊరు వెళ్లే బస్సు కోసం వేచి ఉన్నారు. మరోవైపు తనకు ఆకలిగా ఉన్నదని, వేడివేడి పకోడీలు తీసుకురమ్మని భర్త ప్రీతమ్ సింగ్కు భార్య రిమ్జిమ్ చెప్పింది. దీంతో బస్టాండ్ చివరలో ఉన్న షాపు వద్దకు అతడు వెళ్లాడు. పకోడీలు కొని తిరిగి వచ్చేసరికి భార్య కనిపించలేదు. మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్లో ఉండటంతో ఆందోళన చెందాడు. ఆమె కోసం బస్టాండ్ అంతా వెతికాడు. అక్కడున్న వారిని ఆరా తీశాడు. ఒక వ్యక్తితో కలిసి భార్య వెళ్లినట్లు తెలుసుకున్నాడు. కాగా, ఆందోళన చెందిన ప్రీతమ్ సింగ్ స్థానిక పోలీస్ స్టేషన్కు వెళ్లాడు. భార్య అదృశ్యంపై ఫిర్యాదు చేశాడు. ఆమె గ్రామానికి చెందిన యువకుడితో కలిసి పారిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రిమ్జిమ్ మొబైల్ ఫోన్ ట్రాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజ్ను పరిశీలిస్తున్నారు.

# తెలంగాణ జిల్లాలకు మహర్దశ




**నల్గొండ,తెలంగాణ దిశ :** తెలంగాణ జిల్లాలకు మహర్దశ పట్టనుంది. ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని చెప్పారు. రోడ్లు ? భవనాల శాఖ పురోగతిపై సీఎం రేవంత్ ) సంబంధింత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ - విజయవాడ ఎక్స్ప్రెస్ వే నుంచి నాగార్జునసాగర్ చేరేందుకు గ్రీన్ఫీల్డ్ రహదారి నిర్మాణంపైనా అధ్యయనం చేయాలని చెప్పారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఇక ప్రభుత్వ శాఖలు ఇకనుంచి తప్పనిసరిగా ఎలక్ట్రిక్ వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. కాలుష్య రహిత రవాణా వ్యవస్థ లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని ప్రభుత్వ శాఖలు అద్దెకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ విధానాలకు స్వస్తి చెప్పాలని, మొత్తం ఆన్లైన్లోనే కార్యకలాపాలు కొనసాగించాలని ఆదేశించారు. రవాణా శాఖపై మంత్రి పొన్నంతో కలిసి సమీక్ష నిర్వహించిన సీఎం.. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదన్నారు.వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని, ప్రజల్లో చైతన్యం తేవడానికి షార్ట్ ఫిల్మ్ ప్రదర్శించాలని సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్కు స్థలం కేటాయిస్తామని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అదికారులను ఆదేశించారు.

# టీజీపీఎస్సీలో కీలక సవరణలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కీలక అప్డేట్ ఇచ్చింది. ఇక నుంచి ఆర్నెల్లకోసారి సవరణకు అవకాశం కల్పించింది. దాంతో పాటు కొత్తగా విద్యార్హతలు ఉంటే వాటిని అప్డేట్ చేసుకోవాలని సూచించింది. ఓటీఆర్లో నమోదు చేసిన వివరాల ఆధారంగానే వారి ఉద్యోగార్హతలు నిర్ణయించనున్నట్లు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే ఉద్యోగార్థులకు అలర్ట్. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక సంస్కరణ చేపట్టింది. ప్రస్తుతం టీజీపీఎస్సీ వద్ద అందుబాటులోని వన్టైం రిజిస్ట్రేషన్ వివరాలు, అందులోని అర్హత ఆధారంగానే రానున్న ఉద్యోగ ప్రకటనలకు ఆయా అభ్యర్థులకు అర్హత కల్పించనుంది. ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు మాత్రమే ఓటీఆర్లో అప్డేట్ చేసుకునేందుకు అవకాశమివ్వనుంది. అంటే ఏడాదిలో జనవరి, జూన్ నెలల్లో వారం నుంచి 10 రోజులు ఓటీఆర్ అప్డేట్ కు అవకాశం ఇస్తారు. అప్పటికి అదనంగా పొందిన విద్యార్హతలు ఓటీఆర్లో పొందుపరిచేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించనున్నారు. ఇప్పటికీ ఓటీఆర్ అప్డేట్ చేసుకోని వారు తమ ఐడీ సహాయంతో ఈనెల 25లోగా అదనపు అర్హతలకు సంబంధించిన సర్టిఫికేట్లను ఓటీఆర్ పోర్టల్లో అప్లోడ్ చేసుకోవాలని సూచించారు.టీజీపీఎస్సీ కొత్త సవరణల ప్రకారం.. ఉద్యోగార్థులు ఓటీఆర్లో తాజా కలర్ ఫొటోను అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. కొత్తగా పొందిన అదనపు విద్యార్హతల సంబంధించిన వివరాలు నమోదు చేయడంతో పాటు ధ్రువపత్రాలు కూడా సమర్పించాలి. ఒకసారి అప్డేట్ చేసిన ఓటీఆర్ను ఆ అభ్యర్థి లేదా కమిషన్ రద్దు చేసేవరకూ చెల్లుబాటవుతుంది. ఓటీఆర్లో అదనపు అర్హతలు, అడ్రస్, ఈడబ్ల్యూఎస్, నాన్ క్రీమీలేయర్ కేటగిరీలు, ఫోన్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ మినహా ఇతర వివరాలు అప్డేట్ చేయడానికి వీల్లేదు.రాష్ట్రంలో కమిషన్ వద్ద ప్రస్తుతం 31.56 లక్షల ఓటీఆర్లు ఉన్నాయని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. గడిచిన రెండేళ్లుగా కొత్తగా ఉద్యోగార్థులైన అభ్యర్థులు 2 లక్షల వరకు ఉంటారని వెల్లడించారు. వీరంతా విద్యార్హతలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటీఆర్లో నమోదు చేసిన కుల, ఆదాయ, క్రీమీలేయర్, విద్యార్హతల వివరాలను టీజీపీఎస్సీ ముందస్తుగా తనిఖీ చేయిస్తుందని అన్నారు. గతంలో విద్యార్హతలు, వ్యక్తిగత వివరాలు పేర్కొన్నా వాటికి ఆధారాలు సమర్పించాలన్న నిబంధన తప్పనిసరి లేదని... తాజా సవరణల ప్రకారం అభ్యర్థులు వాటిని కూడా అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు.ఓటీఆర్లో నమోదు చేసిన విద్యార్హతల ఆధారంగానే ప్రభుత్వం విడుదల చేసే ఒక నియామక ప్రకటనకు వారు అర్హులవుతారా? లేదా? అనే విషయాన్ని ఓటీఆర్ గుర్తిస్తుందన్నారు. అందులో నమోదు చేసిన వివరాలను మీసేవ, యూనివర్సిటీలు, సాంకేతిక విద్య, ఉన్నత విద్యామండలి సహాయంతో పరిశీలిస్తుందని చెప్పారు. ఎవరైనా తప్పుడు ధ్రువీకరణతో నమోదు చేసినట్లు వెల్లడైతే వెంటనే వారి ఓటీఆర్ రద్దు చేస్తుందన్నారు.


# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే

**ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం**
**మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం**
**మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి**
**పదేపదే బిజెపిని విమర్శించడం అపండి**
**తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మూసీ ప్రాజెక్ట్పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.. ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యం తరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.




# షూటింగ్‌లో రామ్ చరణ్‌కు స్వల్ప గాయం..!




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈసినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నా యి. ఇదిలా ఉంటే, ఈ చిత్రం షూటింగ్ సమయంలో చరణ్‌కు చిన్నపాటి గాయం అయినట్లు సమాచారం. షూటింగ్ సందర్భంగా చరణ్ కంటి సమీపంలో స్వల్ప గాయం తగిలిందని తెలుస్తోంది. అయితే ఈ గాయం విషయంలో పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిన్నపాటి గాయమేనని చిత్రబృందం స్పష్టం చేసింది. ఈ గాయం కారణంగా చరణ్ రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోనున్నాడు. అనంతరం తిరిగి షూటింగ్‌లో పాల్గొననున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. త్వరలోనే చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనుంది. ఇక ఈ శుక్రవారం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 'పెద్ది' చిత్రం నుంచి టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తుండగా, ప్రముఖ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ చిత్రం, చరణ్ కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక 'పెద్ది' ఐటమ్ సాంగ్ గురించి గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో ముగ్గురు భామలు ఆడిపాడనున్నారని, కాదు నలుగురు హీరోయిన్లు కనిపిస్తారని.. అంటూ అనేక వార్తలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.. చివరికి ఇద్దరి పేర్లు మాత్రం ప్రముఖంగా వినిపించాయి. 'రంగస్థలం' సినిమాలో జిల్ జిల్ జిగేల్ రాణిగా చెర్రీతో కలిసి చిందులేసిన పూజా హెగ్డేని స్పెషల్ సాంగ్ కోసం సంప్రదిస్తున్నారని టాక్ వచ్చింది. ఆ తర్వాత 'సీతారామం' భామ మృణాల్ ఠాకూర్ ఈ పాటలో ఆడిపాడనుందని చెప్పుకొచ్చారు. ఫైనల్ గా మృణాల్ వైపే మేకర్స్ ఎక్కువ మొగ్గుచూపారని సమాచారం. దీనిపై త్వరలోనే క్లారిటీ రానుంది.

# అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు






ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు.

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాటజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.


# రణ్‌వీర్ సింగ్‌కి కర్ణాటక హైకోర్టు నోటీసులు





బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కాంతార సినిమాలో చూపించిన పవిత్రమైన వరాహ రూపం, అలాగే దక్షిణ కర్ణాటక ప్రాంతంలో అత్యంత ఆచారబద్ధంగా నిర్వహించే 'భూత కోల' సంప్రదాయాన్ని మిమిక్రీ రూపంలో అనుకరించి అపహాస్యం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై అభ్యంతరం వ్యక్తం చేసిన కర్ణాటకకు చెందిన ఒక సాంస్కృతిక సంస్థ, హైకోర్టును ఆశ్రయించగా, కర్ణాటక హైకోర్టు ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది.న్యాయస్థానం ఈ వ్యవహారంపై స్పందిస్తూ, రణ్‌వీర్ సింగ్‌కి నోటీసులు జారీ చేసింది. తన చర్యపై స్పష్టమైన వివరణ ఇవ్వడంతో పాటు, అఫిడవిట్ రూపంలో క్షమాపణ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. గతంలో చేసిన క్షమాపణలు మనస్ఫూర్తిగా చెప్పలేదని కోర్టు వ్యాఖ్యానించడం గమనార్హం. కళాత్మక స్వేచ్ఛ పేరుతో ఇతరుల మతపరమైన భావాలను దెబ్బతీయడం సమంజసం కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ప్రజాదరణ కలిగిన నటులు సామాజిక బాధ్యతతో ప్రవర్తించాలని కోర్టు హెచ్చరించింది.పిటిషనర్ తరఫు వాదనలో 'భూత కోల' అనేది కేవలం నృత్యం కాదని, అది కోట్లాది మంది విశ్వాసానికి ప్రతీక అని తెలిపారు. అలాంటి పవిత్ర సంప్రదాయాన్ని వినోదం కోసం అనుకరించడం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ మిమిక్రీ వీడియోలను వెంటనే తొలగించాలని కూడా డిమాండ్ చేశారు. అయితే రణ్‌వీర్ తరపు న్యాయవాదులు అది కేవలం సరదాగా చేసిన ప్రదర్శన మాత్రమేనని, ఎవరినీ అవమానించే ఉద్దేశ్యం లేదని వాదించారు. ఈ నేపథ్యంలో, రణ్‌వీర్ నుంచి వివరణ వచ్చిన తర్వాత తదుపరి విచారణ కొనసాగుతుందని హైకోర్టు వెల్లడించింది. ప్రస్తుతం ఈ వివాదం సినీ, న్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ముఖ్యంగా ప్రాంతీయ సంప్రదాయాలు, ఆచారాల పట్ల బాలీవుడ్ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రణ్‌వీర్ సింగ్ చేసిన మిమిక్రీ ఘటనతో స్థానిక సంస్కృతుల గౌరవంపై మరోసారి చర్చ మొదలైంది. ఈ వ్యవహారంపై స్పందించిన కర్ణాటక హైకోర్టు, రణ్‌వీర్ సింగ్ నుంచి వివరణ అందిన తర్వాత తదుపరి విచారణ కొనసాగిస్తామని వెల్లడించింది. కళాత్మక స్వేచ్ఛకు హద్దులు ఉంటాయని, ఇతరుల విశ్వాసాలను గౌరవించడం ప్రజా ప్రముఖుల బాధ్యత అని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# జైపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం... నటి హర్షిల్ కాలియా మృతి



రాజస్థాన్ రాజధాని జైపూర్లో  జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో యువ నటి, మోడల్ హర్షిల్ కాలియా (30) ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన షిప్రా పాత్ రోడ్డులో చోటుచేసుకుం ది. పోలీసుల వివరాల ప్రకారం, హర్షిల్ కాలియా తన పనులు ముగించుకుని రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో ఇంటికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆమె ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రోడ్డుపై ఉన్న డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు ప్రస్తుతం బయటకు వచ్చాయి. వాటిలో కారు వేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొట్టి ఎడమ వైపుకు పల్టీలు కొడుతూ బోల్తా పడిన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ వీడియోలు ప్రమాద తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి కారునుండి హర్షిల్‌ను బయటకు తీశారు. తీవ్రమైన తల గాయాలతో ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడికి చేరుకునే సరికి పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమె మరణించినట్లు ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై విచారణ కొనసాగుతోంది. అతివేగం కారణమా? లేక మరే వాహనం ఓవర్‌టేక్ చేయడానికి ప్రయత్నించడంతో నియంత్రణ కోల్పోయిందా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. హర్షిల్ కాలియా 'క్రైమ్ నెక్స్ట్ డోర్' అనే వెబ్ సిరీస్ ద్వారా గుర్తింపు పొందారు. అదనంగా ఒక న్యూస్ ఛానల్‌లో యాంకర్‌గా కూడా పనిచేశారు. పలు రాజస్థానీ పాటల్లో ప్రధాన పాత్రల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇటీవల మోడలింగ్ రంగంలో మరింతగా రాణించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆమె తండ్రి కూడా జర్నలిజం రంగంలో పనిచేస్తుండడం విశేషం. హర్షిల్ కాలియా అకాల మరణం రాజస్థానీ చిత్ర పరిశ్రమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. యువ ప్రతిభను కోల్పోవడంతో సినీ, మీడియా వర్గాలు సంతాపం వ్యక్తం చేస్తున్నాయి.

## ఇన్‌స్టాలోకి ఎంట్రీ ఇచ్చిన పవన్ కళ్యాణ్ భార్య..

# మొదటి పోస్ట్‌తోనే నెటిజన్లను ఫిదా చేసేసిందిగా!

మెగా పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భార్య అన్నా లెజినోవా ఎట్టకేలకు సోషల్ మీడియా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఇప్పటి వరకు కెమెరా ముందుకు రావడానికి పెద్దగా ఇష్టపడని ఆమె, ఇప్పుడు నేరుగా ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరవడం మెగా అభిమానుల్లో పెద్ద చర్చకు దారితీసింది. 'అన్నా కొణిదెల' (Anna Konidela) పేరుతో ఖాతా ఓపెన్ చేశారు. అన్నా లెజినోవా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మొదటి పోస్ట్‌గా తన భర్త పవన్ కళ్యాణ్‌తో ఉన్న ఒక బ్యూటిఫుల్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఫొటో చూసిన మెగా ఫ్యాన్స్ 'వదినమ్మకు సాదర స్వాగతం' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఇక ఈ అకౌంట్ ఓపెన్ చేసిన 10 నిమిషాల్లోనే 21 వేల మందికి పైగా ఫాలోవర్స్ ఆమెను ఫాలో అవడం మొదలుపెట్టారు.  దీన్ని బట్టి పవన్ కళ్యాణ్ సతీమణికి సోషల్ మీడియాలో ఏ రేంజ్ వెల్‌కమ్ లభించిందో అర్థం చేసుకోవచ్చు. ఇక ఈ పోస్ట్‌కు "ఇది ఎప్పటి నుంచో జరగాల్సిన విషయం.. ఇప్పుడే సరైన సమయం అనిపిస్తోంది. మెగాస్టార్ చిరంజీవి గారి ఆశీస్సులు, నా భర్త పవన్ కళ్యాణ్ గారి మద్దతుతో ఈ ఖాతాను ప్రారంభిస్తున్నాను" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. కుటుంబ సభ్యుల మద్దతుతోనే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇక పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉన్న సమయంలో, అన్నా లెజినోవా ఇలా సోషల్ మీడియాలోకి రావడం వెనుక ఏదైనా ప్రత్యేక ఉద్దేశం ఉందా? అని నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

# ఓటీటీలోకి 'మృత్యుంజయ్'




టాలీవుడ్ హీరో శ్రీ విష్ణు నటించిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ మృత్యుంజయ్ థియేటర్లలో సక్సెస్ ఫుల్ రన్‌ను పూర్తి చేసుకుని ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. దర్శకుడు హుస్సేన్ షా కిరణ్ తెరకెక్కించిన ఈ చిత్రం ప్రయోగాత్మక కథాంశంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్ నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది. అయితే ఈ విషయంపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. తెలుగు సహా పలు భాషల్లో ఈ సినిమాను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. 'మృత్యుంజయ్' సినిమా థియేటర్లలో ఓ మోస్తరు విజయాన్ని అందుకుంది. కథలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, స్క్రీన్‌ప్లేలో ఉన్న ట్విస్టులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా శ్రీ విష్ణు ఈ సినిమాలో కొత్త మేకోవర్‌లో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో రెబా మోనికా జాన్ హీరోయిన్‌గా నటించి తన పాత్రతో మెప్పించారు. అలాగే రచ్చ రవి,నెల్లూరు సుదర్శన్, సిజ్జు, అయ్యప్ప శర్మ వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. క్రైమ్, యాక్షన్, ఎమోషన్ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు విభిన్న అనుభూతిని అందించింది. లైట్ బాక్స్ మీడియా, పిక్చర్ పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. సంగీతాన్ని కాలభైరవ అందించగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు మరింత బలం చేకూర్చింది. థియేటర్లలో మంచి స్పందన పొందిన మృత్యుంజయ్ ఇప్పుడు ఓటీటీ ద్వారా చాలా మంది ప్రేక్షకులను చేరుకునేందుకు సిద్ధమవుతోంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215